ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
శనివారం 21 డిసెంబరు 2024



బాపట్ల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం





ప్రత్తిపాడులోని అగ్రీ ల్యాబ్

- విత్తనాలు, ఎరువుల నాణ్యత తేలటం గగనమే
- ఏఓలు చెయ్యాల్సిన టెస్టులు ఏఈఓలు చేస్తున్నారు
- ల్యాబ్‌లు పెట్టిన లక్ష్యానికి తూట్లు
- ఉమ్మడి జిల్లాలోని 15 కేంద్రాల్లో అదే దుస్థితి

అగ్రీ పరీక్షలు.. అం తంతమాత్రమే

గుంటూరు సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కోట్లు కుమ్మరించి ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఫలితంగా రైతు సేవలో మునిగి తేలాల్సిన అగ్రీ ల్యాబ్‌లు వృధాగా పడివున్నాయి. విత్తనాలు, ఎరువుల నాణ్యత నిర్ధారించేందుకు అన్ని రకాల పరికరాలు ఉన్నప్పటికీ పరీక్షలు చేసే వారు లేక ఉసూరు మంటున్నాయి. నాబార్డుకు చెందిన రూ. 200 కోట్ల నిధుల తో 2021 లో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో మినహాయించి ప్రతి నియోజకవర్గంలో ఈ ల్యాబ్‌లు ఏర్పాటు అయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 నియోజకవర్గ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఇక్కడ విత్తనాలు, ఎరువుల నాణ్యతను నిర్ధారిస్తారు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, భౌతిక స్వచ్ఛత పరీక్షలు నిర్వహిస్తారు. ఎరువుల్లో న్యూట్రియంట్లు(పోషకాలు) , తేమ శాతం, పార్టికల్ సైజును పరీక్షిస్తారు. ఇటువంటి పరీక్షలు చేయడం ద్వారా రైతులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుంది. నకిలీలు, కల్తీ లకు కళ్లెం పడుతుంది.

నెలకు 80 కి పైగానే నమూనాలు...

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ల్యాబ్ లకు ప్రతి నెలా 80 నుంచి 100 నమూనాలు పరీక్షల నిమిత్తం వస్తున్నాయి. వాటిని అగ్రికల్చర్ బీఎస్సీ చదివిన వ్యవసాయ అధికారి మాత్రమే పరీక్షలు జరపాలని ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్- 1985 చెబుతోంది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ ల్యాబుల్లో ఏఓ లు లేరు. కేవలం ఏఈఓ (వ్యవసాయ విస్తరణ అధికారులు) మాత్రమే పరీక్షలు నిర్వహించి ఫలితాలు తేలుస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఇదే తంతు నడుస్తోంది.

అంతా తూతూ మంత్రం..

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ల్యాబుల్లో జరుగుతున్న విత్తనాలు, ఎరువుల

(మిగతా 8వ పేజీలో..)



ప్రత్తిపాడు అగ్రీల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న ఏఈఓ

- ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో అస్తవ్యస్తం
- సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు వీల్లేదు
- ఈ-స్టాంపింగ్ విధానాన్ని రద్దు చేసే యోచన

ప్రక్షాళన దిశగా రిజిస్ట్రేషన్..!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సకల వ్యవస్థలను గాడి తప్పించినట్లుగానే గత ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను కూడా భ్రష్టు పట్టించింది. ఏకపక్ష నిర్ణయాలతో సదరు విభాగాన్ని కునారిల్లేలా చేసింది. సాఫ్ట్‌వేర్ రూప కల్పనలో ఇష్టారీతిన వ్యవహరించింది. సర్వర్ నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో వారు కమీషన్ల కోసమే అన్నట్లు ఉన్నారు తప్పితే ప్రజల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. 2.0 పేరిట కార్డు ప్రైమ్ విధానాన్ని అమలు చేసి ప్రజలను నానా ఇక్కట్లకు గురి చేసింది. జ్యుడీషియల్ పత్రాల స్థానంలో ఈ స్టాంపింగ్ ఇలా ఒక్కటేమిటీ అన్నీ అడ్డగోలు నిర్ణయాలతో సదరు శాఖను తిరోగమన బాట పట్టేలా చేసిన గత ప్రభుత్వానిది. ఇక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ అంటూ గత ప్రభుత్వం చేసిన హడావిడి ప్రహసనాన్ని తలపించింది తప్పితే ప్రజలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. ఇవన్నీ ఒక ఎత్తయితే రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలను తమ అడ్డాలుగా మార్చుకుని రాజకీయ పైరవీలతో వైసీపీ నేతలు చెలరేగిపోయారు. ఏళ్ల తరబడి ఒకే పోస్టింగ్‌లో ఉన్నవారిని కొనసాగిస్తూ ఉద్యోగుల బదిలీలను కూడా అపహస్యం చేసిన ఘనత గత పాలకులది. వీటన్నింటి మధ్య ప్రజలు తమ హక్కుగా పొందాల్సిన రిజిస్ట్రేషన్‌ల కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితిని గత ప్రభుత్వంలో ఎదుర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలను సవరించడంతో పాటు మొత్తం రిజిస్ట్రేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేసే చర్యలు కూటమి ప్రభుత్వంలో ఊపందుకున్నాయి. దీనిలో భాగంగా గత ప్రభుత్వం జారీ చేసిన కొన్ని ఉత్తర్వులను ఇప్పటికే రద్దుబాట పట్టించిన ప్రభుత్వం ఐదేళ్లలో జరిగిన అడ్డగోలు రిజిస్ట్రేషన్‌ల నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమయి ఉంది

దాదాపుగా ఐదు వేల రిజిస్ట్రేషన్లు....

వైసీపీ ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు అంటూ హడావిడి చేసిన సంగతి విదితమే. ఈ విధానంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల రిజిస్ట్రేషన్లు సచివాలయాలు వేదికగా జరిగినట్లు తెలుస్తోంది. ఇక్కడ జరిగిన వాటిల్లో ఎక్కువ శాతం వైసీపీ నేతల ఒత్తిళ్లతో నిబంధనలకు విరుద్ధంగా జరిగినవేననే ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి. గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు కూడా చాలావరకు సచివాలయాల్లోనే జరిగాయి. వీటన్నింటిపై విచారణకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ విధానానికి పూర్తిగా ఎత్తివేసి సదరు విభాగానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా అడుగులేస్తోంది

భూ దందాలకు దన్నుగా...

నిబంధనలను కాలరాసి ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో వైసీపీ నేతాగణం పోటీ పడింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి తమ పబ్బం గడుపుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఈ అడ్డగోలు రిజిస్ట్రేషన్‌ల లెక్కతేల్చాలని ఆదేశాలు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో బాపట్ల జిల్లాలో 76 ఎకరాల వరకు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 250 ఎకరాల వరకు ఉండొచ్చనేది అంచనాగా ఉంది. ఇదే సమయంలో ప్రభుత్వ నిబంధనలేవీ పాటించకుండా పుట్టగొడుగుల్లా గత ప్రభుత్వంలో అక్రమ లే అవట్లు వెలిశాయి. వీరి పాపాలకు రిజిస్ట్రేషన్ శాఖ కూడా తనవంతుగా సహకారం అందించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 550 లే అవుట్లను అక్రమమైనవాటిగా గుర్తించి వాటి వివరాలను ప్రజల ముందుంచింది. వీటి విషయంలో రిజిస్ట్రేషన్లు

(మిగతా 8వ పేజీలో..)





జొన్నలగడ్డ సొసైటీ భవనం

మరో ఆరు నెలలు.. అధికారుల పాలనే

- సహకార ఎన్నికలు లేవు
- ఉత్తర్వులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాలకు గతంలో నియమించిన పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 21 నుంచి పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితి ముగియనుండడంతో సొసైటీలకు ఎన్నికలు జరుగుతాయని ప్రచారం జరిగింది. ఒక వేళ ఎన్నికలు నిర్వహించకపోతే త్రిసభ్య కమిటీలను నామినేట్ చేస్తారని కూడా ప్రచారం చేశారు. వీటన్నిటికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెడుతూ పర్సన్ ఇన్‌చార్జ్ పాలనను కొనసాగిస్తూ అయా జిల్లాల సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌లు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 168 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 12,31,363 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సొసైటీల అధ్యక్షుల పదవీ కాలం 2019 వరకు పొడిగించారు. రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. రైతులు ఓటు ద్వారా వారికి నచ్చిన రైతులను సంఘాలకు ఎన్నుకోవాలి. రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. వీటన్నింటికి గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచింది. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను ప్రభుత్వమే నియమించింది. పార్టీ వ్యక్తులను నామినేషన్ పద్ధతిలో సొసైటీలకు ఎంపిక చేసింది. దీంతో సొసైటీలు పూర్తి రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారులకే సొసైటీల పాలనను అప్పగించింది. దీనివలన కొంత రాజకీయ జోక్యం తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు పాలకులు సాహసం చేయకపోవడానికి సొసైటీల ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉండటమేనన్న వాదన వినిపిస్తోంది. వైసీపీ హయాంలో ఏకపక్షంగా సభ్యుల పేర్లు నమోదు చేశారన్న విమర్శలున్నాయి. వీటన్నింటిని సరిదిద్దిన తరువాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

- చైర్మన్‌గా పులుకూరి.. వైస్ చైర్మన్‌గా చక్రపాణి
- పీసీ పదవి రెండు.. మూడేళ్లుగా పంపిణీ
- రెండేళ్లు పులుకూరి.. మూడేళ్లు గోగినేని
- డెల్టాలోనూ.. చెరి సగం..!
- తొలి రెండేళ్లు మురళీధరరావు
- తదుపరి మూడేళ్లు సునీల్ చౌదరి

సాగర్ ప్రాజెక్టు కమిటీకి.. కూటమి అభ్యర్థుల ఖరారు



పులుకూరి కాంతారావు | ఉప్పలపాటి చక్రపాణి | గోగినేని కోటేశ్వరరావు

(నరసరావుపేట, బాపట్ల ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ కూటమి అభ్యర్థులను తెలుగుదేశం అధిష్ఠానం ఖరారు చేసింది. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నేడు జరగనున్న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగనున్నాయి. పీసీ పదవికి టీడీపీ నేతల మధ్య పోటీ ఏర్పడటంతో అధిష్ఠానం దృష్టి సారించింది. పదవులు ఆశిస్తున్న వారితో చర్చలు జరిపింది. ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకొని శుక్రవారం పీసీ అభ్యర్థులను ఖరారు చేశారు. పోటీ ఉండటంతో ఐదేళ్ల పీసీ పదవిని రెండేళ్లు.. మూడేళ్లుగా పంపిణీ చేసింది. తొలుత రెండేళ్లు గురజాల నియోజకవర్గానికి చెందిన కారంపూడి డిస్ట్రిబూటరీ కమిటీ అధ్యక్షుడు పులుకూరి కాంతారావు పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. తదుపరి మూడేళ్లు సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముపాళ్ల డీసీ అధ్యక్షుడు గోగినేని కోటేశ్వరరావును ఖరారు చేశారు. ఈ మేరకు ఇద్దరి మధ్య అధిష్ఠానం సయోధ్య చేసింది. తొలుత తమ నియోజకవర్గానికే పీసీ పదవి కావాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ పట్టు పట్టారు. ఇరువురి మధ్య పార్టీ అధిష్ఠానం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కాగా పల్నాడు జిల్లాకు చైర్మన్ పదవి కేటాయించగా, బాపట్ల జిల్లాకు వైస్ చైర్మన్ పదవిని అధిష్ఠానం కేటాయించింది. పర్చూరు నియోజవర్గానికి చెందిన కొనంకి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి పేరును ఖరారు చేశారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో పీసీ ఎన్నికల కోసం జలవనరుల శాఖ ఏర్పాట్లు చేసింది. పీసీ పరిధిలో మొత్తం 48 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీరు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. అధిష్ఠానం పేర్లు ఖరారు చేయడంతో పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక లాంచనమే. పల్నాడు జిల్లాలో 25, గుంటూరు జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో 8, ప్రకాశం జిల్లా పరిధిలో 10 డీసీలు ఉన్నాయి.

డెల్టాలోనూ.. ఇద్దరికి

కృష్ణా వెస్ట్రన్ డెల్టా(కేడబ్ల్యూడీ) పరిధిలోని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక శనివారం జరగనుంది. ఈ పదవి విషయంలో అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. తొలి రేండేళ్ల రేపల్లె నియోజకవర్గానికి చెందిన పంతాని మురళీధరరావు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, తదుపరి మూడేళ్ల కాకుమాను మండలానికి చెందిన సునీల్ చౌదరి వ్యవహరించనున్నారు. ఇప్పటికే వీరి నియామకానికి సంబంధించి శుక్రవారం రాత్రికే జిల్లాకు చెందిన నేతలు ఏకాభిప్రాయానికి రాగా, శనివారం ఉదయం జరిగే ఎన్నిక ఏకగ్రీవం కానుందని సమాచారం. అమర్తలూరు మండల పరిధిలోని కూచిపూడి లాకుల వద్ద ఉన్న ఇరిగేషన్ శాఖ భవనం వేదిక కానుంది. ఇప్పటికే జిల్లా పరిధిలో ఉన్న 22 డీసీల పదవుల్లో కొలువుదీరిన వారికి శనివారం ఉదయం 7 గంటలకల్లా కూచినపూడి లాకుల వద్దకు చేరుకోవాలని ఇరిగేషన్ శాఖ సమాచారం ఇచ్చింది.

- అనుమతులపై స్పందించని నిర్వాహకులు
- అపశ్రుతులు లేకుండా చూడాలంటున్న స్థానికులు

తీరంలో వేడుకలకు.. రంగం సిద్ధం

చీరాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సర వేడుకలకు రాష్ట్రమంతా సిద్ధమవుతోంది. ఇదే క్రమంలో చీరాల రిసార్ట్స్ నిర్వాహకులు కూడా సందర్శకులను వివిధ ఆఫర్లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఒక్కో టిక్కెట్ ధర రూ.2వేలు నుండి రూ.4 వేల వరకు ఆయా రిసార్ట్స్, హోటల్స్ స్థాయిని బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. టికెట్ పొందిన వ్యక్తులకు మద్యం, స్నాక్స్, భోజనం కల్చరల్ ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని ప్రచారం చేస్తున్నారు. అయితే ఆయా కార్యక్రమాలకు అనుమతి తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారా లేదా అనే ప్రశ్నకు మాత్రం వారి నుంచి సమాధానం రావడం లేదని తెలుస్తోంది. చీరాల ప్రాంతంలో పలు రిసార్ట్‌ల ఎదురుగా ఉన్న సముద్రతీరంలో ఎలాంటి అనుమతులు లేకుండా తాగి ఊగే పార్టీలు జరుగుతున్నాయన్నది బహి రంగ రహస్యం. వీటిపై చర్య లు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు ఆవైపు కన్నెత్తి చూడరు. ఇదిలాఉంటే డిసెంబరు 31 రాత్రికి నూతన సంవత్సర వేడుకల పేరుతో పార్టీలు పెట్టి కాసులు దండుకునేందుకు పలు రిసార్ట్‌ల నిర్వాహకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎప్పటి మాదిరిగానే అనుమతులు లేకుండానే ఈవెంట్‌ల పేరుతో తమ దందా సాగిం చాలని ఉద్దేశంతో ముందుడుగులు వేస్తున్నట్లు సమాచారం.

పోలీస్, ఎక్సైజ్ అనుమతులు తప్పనిసరి

ప్రత్యేక ఈవెంట్‌ల పేరుతో నూతన సంవత్సర వేడుకలు జరపాలంటే ముందస్తుగా పోలీస్ అనుమతి తప్పనిసరి. మద్యం వినియోగానికి ఎక్సైజ్ అధికారులు నుండి అనుమతి పొందాలి. దీంతోపాటు నిబంధనలు మేరకు మాత్రమే అబ్కారీ శాఖ నుండి మద్యం కొనుగోలు చేయాలి. అంతే కాకుండా తీరంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ పేరుతో నిర్వహించే క్యాంపు ఫైర్ కుర్చీల ఆట ఇతర ప్రత్యేక కార్యక్రమాలపై పోలీస్‌లు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఈవెంట్‌కు హాజరయ్యే వ్యక్తులతో పాటు, ఇతరులు కూడా అది పబ్లిక్ ప్లేస్ అంటూ పాల్గొనే అవకాశం ఉంటుంది. వీటి దగ్గర గతంలో ఘర్షణలు జరిగిన సందర్భంకూడా ఉంది. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కనీసం ఈ ఏడాదైనా నిబంధనలు పాటించే విధంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. ఇప్పటికే తీరంలో జరిగిన అపశ్రుతులతో పలువురు ప్రాణాలు వదిలారు. నిర్వహించే ఈవెంట్‌లలో అపశ్రుతులు దొర్లకుండా ఉండాలంటే సంబంధిత అధికారుల నుంచి పక్కాగా అనుమతులు పొంది నిబంధనల మేరకు మాత్రమే ఆ ఈవెంట్‌లు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



అనుమతులు పొందాల్సిందే - ఎండీ మోయిన్ డీఎస్పీ చీరాల

తీరంలో నిర్వహించే ఈవెంట్‌లకు ముందస్తుగా పోలీస్ అనుమతి తప్పనిసరి. నిబంధనలు మేరకు వారు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ముందస్తుగా అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులు పొందాక మాత్రమే వారి కార్యకలాపాలు నిర్వహించుకోవాలి., లేకుంటే చర్యలు తప్పవు.

చలానా ద్వారా ఈవెంట్ అనుమతికి రుసుము చెల్లించాలి - నాగేశ్వరరావు, ఎక్సైజ్ సిఐ చీరాల

నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ప్రత్యేక ఈవెంట్‌లు తీర ప్రాంతంలో నిర్వహించే ఎవరైనా ముందస్తుగా చలానా రూపేణా నిర్ణీత రుసుం చెల్లించి అనుమతి పొందాలి. ఈవెంట్‌లో వినియోగించే మద్యం అబ్కారీ శాఖ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఎన్‌డీపీ లిక్కర్ వినియోగం నేరం. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.

విజయ్ డిజిటల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్



విజయ్ డిజిటల్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పాతబస్టాండు సెంటరులో విజయ్ డిజిటల్ షోరూం నిర్వాహకులు నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ సూపర్ స్టోర్‌ను ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత షోరూం నిర్వాహకులు, కూటమి నేతలు, కార్యకర్తలు మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేశ్ షోరూంను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. షోరూంలో ఎలక్ట్రానిక్ వస్తువులను పరిశీలించారు. షోరూం సిబ్బంది, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఫోటోలు దిగారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజల నుంచి మంత్రి లోకేశ్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో విజయ్ డిజిటల్ షోరూం అధినేతలు జవ్వాది గంగాధరరావు, ఉషాకిరణ్, జవ్వాది రాహుల్, జయశ్రీ, జవ్వాది లోహిత, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, నేతలు జవ్వాది కిరణ్‌చంద్, నంకా బాలాజీగుప్తా, గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్

తాడికొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 22న ఆల్ ఇండియా ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. ఆనంద్ చెస్ వింగ్స్, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు రూ. 1,55,000 నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. చెస్ పోటీల్లో పాల్గొనే వారు 21వ తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ సీఎం. గోపినాథ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్‌దారులు బ్యాంకు ఖాతాలు మార్చుకోవాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల పరిధిలోని ఈపీఎఫ్ చందాదారులు తమ బ్యాంకు ఖాతాలను జాతీయ బ్యాంకులకు మార్చుకోవాలని ప్రాంతీయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు ఎస్‌బీఐ, యూబీఐలోకి మార్చుకోవాలని, కొన్నిచోట్ల యాక్సిస్ బ్యాంకు ఖాతాలు సరిగా పని చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. సమస్యలు ఉంటే 0863-2344106, 2232921, లేదా ro.guntur@epfindian.gov.in అనే మెయిల్‌లో సంప్రదించాలని సూచించారు.

అంకితభావంతో పనిచేసి పార్టీ రుణం తీర్చుకుంటా

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

నరసరావుటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు చీఫ్‌విప్‌గా అవకాశం ఇవ్వడంతో బాధ్యత మరింత పెరిగిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీకి మరింత అంకితభావంతో పనిచేసి పార్టీ రుణం తీర్చుకుంటా అన్నారు. చీఫ్‌విప్‌గా అసెంబ్లీ సక్రమంగా జరగటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడడం బాధాకరం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని తప్పులు చేస్తే 11 సీట్లుకు పరిమితం అయ్యారో ఒకసారి ఆలోచించుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేయడం, రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేయడం తప్పా జగన్‌మోహన్‌రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. గోదావరి, పెన్నా నదులు అనుసంధానం చంద్రబాబు నాయుడు మొదలు పెడితే జగన్‌మోహన్‌రెడ్డి పనులు ఆపివేసి, నిధులు పక్కదారి పట్టించి గాలికి వదిలేశారన్నారు. వరికపుడిశల ప్రాజెక్టుకు హామీ ఇచ్చి పల్నాడు ప్రజలను జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశాడన్నారు. రాజధాని నిర్మాణం గాలికి వదిలేశారని, పోలవరం చంద్రబాబు నాయుడు 72 శాతం పూర్తి చేస్తే మిగిలింది జగన్ ఎందుకు చేయలేక పోయారో చెప్పాలన్నారు. రాజధాని నిర్మాణం కోసం రూ.33,138 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు చంద్రబాబు నాయుడు పెట్టిన మధ్యాహ్న భోజనం వైసీపీ ప్రభుత్వం ఎందుకు ఆపేసిందో చెప్పాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మళ్లీ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రెండేళ్లలో గోదావరి, పెన్నా అనుసంధానానికి బాటలు వేస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. సమావేశంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాల పాటి శ్రీధర్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు చేసే ప్రతిరైతుకు బీమా వర్తింప చేయాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి



జిల్లా స్థాయి కమిటీతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేస్తున్న ప్రతిరైతుకు లబ్ధి చేకూరేలా బీమా పథకాన్ని వర్తింప చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులను లబ్ధిదారులుగా చేర్చే విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్‌ల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు బాపట్ల జిల్లాలో 1.40 లక్షల మంది ఉన్నారన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులు 23 వేల మంది ఉన్నారన్నారు. రైతులే ప్రీమియం చెల్లించేలా చైతన్య పర్చాలన్నారు. తద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. రైతుల కోసం గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీమా పథకాల నమోదు కోసం జిల్లాలో 247 కామన్ సర్వీస్ సెంటర్‌లు పనిచేస్తున్నాయన్నారు. ప్రస్తుతం 412 హెక్టార్లకు 414 మంది రైతులు మాత్రమే బీమా పథకం ప్రీమియం చెల్లించారన్నారు. రైతులంతా ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయశాఖాధికారులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 7 పంటలకు బీమా అమలౌతుందన్నారు.సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, ఉద్యానవనశాఖాధికారి జెన్నెమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, సీపీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం శివకృష్ణ, టాటాఏఐజీ ఏజెన్సీ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీలు జిల్లా బ్రాండ్‌ను ప్రతిబింబించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

● డిజైన్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ వీక్షణ



శంకర్‌విలాస్ ఆర్‌వోబీ డిజైన్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)పై కన్సల్టెంట్ రూపొందించిన డిజైన్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. కన్సల్టెంట్ మొత్తం రెండు డిజైన్లను రూపొందించి రోడ్లు, భవనాల శాఖకు అందజేయగా ఆ శాఖ అధికారులు వాటిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు నివేదించారు. ఒక డిజైన్ హిందూ కళాశాల సర్కిల్ నుంచి అరండల్‌పేట 10వ లైను వరకు, మరో డిజైన్ సర్కిల్ నుంచి 100 మీటర్ల నుంచి ప్రారంభమయ్యేలా రూపొందించారు. దాదాపు కిలోమీటర్ పొడవునా బ్రిడ్జి ఉండేలా డిజైన్‌లు తయారు చేశారు. వాటిని శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నాగలక్ష్మి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేస్తూ నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలన్నారు. అలానే ఐకానిక్ ఆర్కిటెక్చర్‌ని ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సజావుగా వెళ్లేలా..

ఆర్‌వోబీ డిజైన్, పిల్లర్ల నిర్మాణం, సర్వీసు రోడ్లు, అండర్ పాస్‌లు, బ్రిడ్జిపై డిజైన్లు నూతనంగా ఉండాలన్నారు. ఐకానిక్ డిజైన్‌తోపాటు పిల్లర్లపై జిల్లా బ్రాండ్ ప్రతిబింబించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జన్సీ విభాగం వద్ద అంబులెన్స్‌లకు ఇబ్బంది లేకుండా డిజైన్ రూపొందించాలన్నారు. ట్రాఫిక్ సజావుగా వెళ్లేలా అండర్‌పాస్‌లు ఉండాలన్నారు. మహిళా కళాశాల రోడ్డు నుంచి బ్రిడ్జి అండర్‌పాస్ వైపునకు వచ్చే ట్రాఫిక్‌కు అనుగుణంగా కొన్ని మార్పులు చేయాలని సూచించారు. దీనికోసం మహిళా కళాశాల రహదారిపై ప్రయాణించే వాహనాల ట్రాఫిక్‌పై 24 గంటలు సర్వే చేసి డిసెంబరు 24వ తేదీ నాటికి నివేదిక అందించాలన్నారు. ట్రాఫిక్ సర్వే నివేదిక ఆధారంగా డిజైన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ డీఎస్పీ ఎం రమేష్, ఈఈలు విశ్వనాథరెడ్డి, చిన్నయ్య, నగరపాలకసంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రెహమాన్, రైల్వే డీఈఎన్ భరత్‌కుమార్, కన్సల్టెన్సీ ప్రతినిధులు నరేంద్ర, ప్రణీత్, సిటిజన్స్ ప్రతినిధి కుటుంబరావు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ డెడ్ లైన్లు ఇలా...

● డిసెంబరు 31 నాటికి భవనాల విలువ లెక్కించడాన్ని మున్సిపల్ కార్పొరేషన్ పూర్తి చేయాలి. రోడ్లు, భవనాల శాఖ టెక్నికల్ శాంక్షన్ ఇవ్వాలి.

● జనవరి 31 నాటికి విద్యుత్ స్తంభాలు, తీగెలు, వాటర్ పైపులైన్లు వంటివి షిఫ్టింగ్ చేయాలి.

● ఫిబ్రవరి 28 నాటికి 120 అడుగుల రోడ్డుని జీఎంసీ రోడ్లు భవనాల శాఖకు స్వాధీనం చేయాలి.

● ఫిబ్రవరి 28న టెండర్ల ప్రాసెసింగ్ చేపట్టి కాంట్రాక్టర్ ఎంపిక జరగాలి.

స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థల అభివృద్ధి



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థల అభివృద్ధి చెందుతాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు శుక్రవారం పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ (ఏసీసీఏ) ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్ (ఐఎఫ్ఆర్‌సీ) అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగాధర్ రావు మాట్లాడుతూ ఆర్థిక నివేదికలు, ఆదాయ వ్యయాలను అంచనా వేసుకొని మార్కెట్‌కు అనుగుణంగా మార్పులు చేర్పులు, అంచనాలు వేసినప్పుడే ఆయా సంస్థల మనుగడ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు లోతైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. నిపుణులు అందించే వివరాలను అందిపుచ్చుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపకుల జ్ఞానాభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో ఉండటం గొప్ప విషయం అన్నారు. ముంబాయికి చెందిన ఏసీసీఏ ప్రతినిధి జహీర్ సయ్యద్ మాట్లాడుతూ వ్యాపార సంస్థలు ఆర్థిక నివేదికల సమర్పణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. 100 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలు తప్పనిసరిగా ఐఎఫ్ఆర్ ఎస్ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. చెన్నైకు చెందిన అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ ప్రతినిధి రాయిస్టన్ ఎబినేజర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మార్కెట్ అంచనాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కామర్స్ విభాగాధిపతి ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ మాట్లాడుతూ కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విభాగం అధ్యాపకులు డాక్టర్ ఏ. కనకదుర్గ, డాక్టర్ రత్న కిషోర్, డాక్టర్ జి.నాగరాజు, డాక్టర్ వి.విష్ణు, డాక్టర్ కె.సుధీర్ కుమార్, చంద్రబాను రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి, అనుబంధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైస్తవ మిషనరీ స్థలం కబ్జాకు యత్నం

● అడ్డుకునేందుకు యత్నించిన వారికి బెదిరింపులు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్‌రింగ్ రోడ్డుకు చేరువలో ఉన్న సుమారు నాలుగు ఎకరాల్లోని ఈ సంస్థ స్థలం విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.50 కోట్ల వరకు ఉంది. గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 46వ డివిజన్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆరికట్ల శ్రీనివాసరెడ్డి ఈ స్థలంపై కన్నేశారు. అయితే డెహ్రాడూన్‌లో ఉన్న న్యూ లైఫ్ సంస్థ చైర్మన్ హెలీనాను సంప్రదించి ఈ స్థలాన్ని కారు చౌకగా కొనేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. వాస్తవానికి ఆ సంస్థ బై లా ప్రకారం ఈ స్థలాన్ని ఎవరికీ అమ్మడం గానీ, కొనుగోలు చేయడం గానీ చెల్లదని, అనాథ శరణాలయం, హాస్టల్, స్కూలు, చర్చి వంటి వాటిని సంస్థ నిర్వహించలేని పక్షంలో మరో సంస్థకు అప్పజెప్పే విధంగా బైలాలో ఉన్నట్లు పూర్వ విద్యార్థులు అంటున్నారు. అంతేగాక శ్రీనివాస్ రెడ్డి వద్ద ఎటువంటి ఒప్పందం ఉందో కూడా తమకు తెలియదనీ, ఎవరికి చూపలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని విద్యార్థులు అంటున్నారు. సంఘటనపై పూర్వ విద్యార్థి యాజలి సుధీర్ నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటాం

న్యూ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న చర్చిని కూల్చి వేయడం విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శుక్రవారం రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించి కూల్చిన చర్చిని పరిశీలించారు. సంస్థ స్థలాన్ని, అందులోని చర్చిని కొనసాగించే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

తక్షణమే అరెస్టు చేయాలి

చర్చిని కూల్చి వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని క్రిస్టియన్ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానియేల్ అన్నారు. సంస్థ నిర్వాహకులకు కూడా దానిని విక్రయించే అధికారం లేదనీ, విక్రయించినా అది చెల్లదని ఆయన స్పష్టం చేశారు. అర్ధరాత్రి చర్చిని కూల్చివేయడం దారుణం అన్నారు. ఈ ఘటనపై పూర్వ విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తక్షణం నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ కలిగి ఉండాలి

● మంత్రి నారా లోకేశ్



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలను అనుసరించి ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మంత్రి లోకేశ్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. 2019 నుంచి మంగళగిరిలో తన ప్రయాణాన్ని ప్రారంభించానని, అప్పటి ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ మనోధైర్యాన్ని కోల్పోకుండా ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని చెప్పారు. వైఫల్యమే విజయానికి సోపానంగా నిలుస్తుందని, అందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. వందేళ్ల స్వతంత్ర భారత్ దిశగా పయనిస్తున్న తరుణంలో 2047 నాటికి ఏపీని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అందుకు యువత తమ వంతు బాధ్యత పోషించాలన్నారు. తొలుత కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫాదర్ బాల బొల్లినేని, కళాశాల డైరెక్టర్ యూ.శౌరీలు, కరస్పాండెంట్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశావతార వెంకన్నను దర్శించుకున్న అశోక గజపతిరాజు



ఆలయ సందర్శనలో కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజు

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు గల దశావతార వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రాన్ని కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతి రాజు శుక్రవారం దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం దశావతార వేంకటేశ్వర స్వామికి, మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయన్ను శేషవస్త్రాలతో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనడంలేదని ఆత్మహత్యాయత్నం

చుండూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదంటూ కౌలురైతు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన చుండూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కౌలు రైతు వెనిగళ్ల సాయి దేవదాయ శాఖకు చెందిన ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. తేమశాతం ఎక్కువగా ఉండటతో గత కొద్ది రోజులుగా కూలీల చేత ఆరబెట్టి లాటు కట్టాడు. శాంపిల్స్ తీసి అధికారుల వద్దకు తీసుకు వెళ్లగా కొనుగోలు చేస్తామని చెప్పి, తిరిగి మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని కొనుగోలు నిలిపి వేశారు. దీంతో తీవ్రంగా నష్టపోతానన్న బాధతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు. తిరిగి కొంత సమయానికి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి వైర్లు తాకడానికి ప్రయత్నించడంతో స్థానికులు కర్రలతో నెట్టి వేయడంతో కింది పడి గాయాల పాలయ్యాడు. ఇరుగుపొరుగు వారు అతనిని ఆటో ఎక్కించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మెటల్ లారీలకు రూ.36 వేలు జరిమానా

యడ్లపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ అనుమతులు లేకుండా మెటల్, గ్రానైట్ తరలిస్తున్న వాహనాలను మైనింగ్‌శాఖ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని బోయపాలెం పరిధిలో గురువారం రాత్రి మైనింగ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో మైనింగ్ అనుమతులు లేకుండా స్టోన్ క్రషర్‌ల నుంచి మెటల్ రవాణా చేస్తున్న 6 లారీలను అధికారులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్లు ఏఎంఆర్ సంస్థ జారీ చేసిన రవాణా బిల్లులు ఉన్నాయనీ, తమ లారీలను ఎందుకు అడ్డుకున్నారంటూ మైనింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. క్వారీల నుంచి క్రషర్‌లకు రవాణా చేసే ముడి మెటల్‌కు మాత్రమే ఏఎంఆర్ సంస్థ నుంచి బిల్లులు తీసుకుని తోలుకోవాలని, క్రషర్ నుంచి మెటల్‌ను రవాణా చేసేందుకు మైనింగ్‌శాఖ నుంచి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందాలన్నారు.

ఆర్నెల్ల కిందటే చెప్పాం...

ఈ విషయాన్ని ఆర్నెల్ల కిందటే క్రషర్ యజమానులకు తెలియజేశామనీ, అయినా వారు ఆన్‌లైన్ బిల్లులు తీసుకోవడం లేదన్నారు. ఆన్‌లైన్ బిల్లులు చూపితేనే వదులుతామనీ, లేకుంటే అపరాధ రుసుం చెల్లించి లారీలను తీసుకెళ్లాలని అధికారులు తేల్చి చెప్పారు. లారీ యజమానులకు, మైనింగ్ అధికారులకు మధ్య వాదన జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. క్రషర్ యజమానులను రప్పించి లారీల్లోని మెటల్ పరిమాణం ఆధారంగా అపరాధ రుసుం విధించారు. ఒక్కొక్క లారీకి రూ.6వేల చొప్పున రూ.36 వేలు జరిమానా చెల్లించి లారీలను తీసుకెళ్లారు. కాగా సరైన అనుమతి పత్రాలు లేకుండా ఫిరంగిపురం నుంచి గ్రానైట్ లోడుతో వెళ్తున్న ట్రాలీ లారీని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీలలో మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 577.80 అడుగులు ఉంది. ఇది 276.66 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 18,900 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,966 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 36,966 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101.109.120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

53,675 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 46,813 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,675 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,415 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	13800	334	8000	13500
నెంబరు. 5	8500	12000	నెంబరు.5	8500	14000
273	9000	11500	273	10000	11000
341	8000	15000	341	8000	13300
4884	11000	13500	4884	8000	15000
సూపర్ 10	--	–	సూపర్ 10	11000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16500	తేజ	8000	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	13000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	10000	10300
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4000	9500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

బడుగు, బలహీనవర్గాల దేవుడు అంబేద్కర్

● సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల ప్రజల దేవుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అభ్యంతరకర రీతిలో అంబేద్కర్‌ను సంబోధించటంపై శుక్రవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో పార్టీశ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్యామ్‌లివింగ్‌స్టన్, డాక్టర్ కాగిత వరప్రసాదరావు, కాంద్ర శరత్‌కుమార్, మోర్ల చిన వెంకటేశ్వరరావు, బోయన సూరిబాబు, కొమ్మనబోయన వెంకటఫణీంద్రకుమార్, బాపట్ల భాస్కరరావు, మద్దిబోయన తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

సౌత్, వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీలకు జ్ఞానవివేక్‌గౌడ్


జ్ఞానవివేక్‌గౌడ్

బాపట్ల,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సౌత్, వెస్ట్ యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీలకు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఉప్పాల జ్ఞానవివేక్‌గౌడ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ తెలిపారు. ఈనెల 10వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఈత పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వివేక్‌గౌడ్‌ను ఈ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జ్ఞానవివేక్‌గౌడ్‌ను శుక్రవారం జరిగిన సమావేశంలో కళాశాల బోధన,బోధనేతర సిబ్బంది అభినందించారు.

సంగం డెయిరీని కాపాడిన ఘనత నరేంద్రదే : కొల్లా

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కక్షతో సంగం డెయిరీని స్వాధీనం చేసుకునేందుకు గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 19ను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకుంటూ జీవో నెంబరు 31ని జారీ చేయటం హర్షణీయమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేసిన విమర్శలను తట్టుకోలేక డెయిరీపై తప్పుడు ఆరోపణలతో స్వాధీనం చేసుకునే కుయుక్తులకు పాల్పడటం, పాడిరైతులకు ద్రోహం చేయటమే అవుతుందన్నారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన అమూల్ డెయిరీకి మన రాష్ట్రంలో పాడిపరిశ్రమను తాకట్టు పెట్టి వేలకోట్ల రూపాయల ఖర్చుతో కారుచౌకగా యంత్ర పరికరాలు, భవనాలు సమకూర్చటమే కాక పాలసేకరణ కోసం కలెక్టర్లతో ఊడిగం చేయించారని ఆయన ఆరోపించారు. వైసీపీకి చిక్కకుండా పోరాడినయోధుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అని కొల్లా పేర్కొన్నారు.

పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 3,580 కోట్ల రూపాయల ఫీజురీఎంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లింగిశెట్టి భాలనవ్యశ్రీ డిమాండ్ చేశారు. బాపట్ల డివిజన్ సమితినాయకులతో కలిసి శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా విద్యాదీవెనల పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించటంలో అలసత్వం వహిస్తుందన్నారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ వెంటనే బకాయిలు విడుదల చేసి జీవోనెంబరు 77 రద్దు చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.దిలీప్, ఆర్.నాయుడు, జగన్మోహన్, మురళి శంకర్, తేజ, చరణ్, భార్గవ్, లక్ష్మణ్, హేమంత్, అజయ్, రామ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలి : జనసేన

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఏర్పడి మూడు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు దివ్యాంగుల సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయలేదని జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు అన్నారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో వారానికి మూడురోజులు ఏడి, సిబ్బంది అందుబాటులో ఉండాలని, కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. క్యాంప్ ఏర్పాటు చేసి దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయాలన్నారు. దివ్యాంగులకు గుర్తింపుకార్డులిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంది వెంకటరెడ్డి, పి.బాలసుందర్, పి.లక్ష్మీ, వీర్రాజు, వీరయ్య, మౌలాలి, శ్రీనివాసరావు, సాంబయ్య, నాగరాజు, వెంకట్రావు, విజయరాజు, జానీబాషా ఉన్నారు.

అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు

కర్లపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్ కలాంఫౌండేషన్ కర్లపాలెం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రెసిడెంట్, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా తెలిపారు. కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చందోలు గ్రామానికి చెందిన పేద మహిళలకు పది కేజీల బియ్యం పంపిణి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అయూబ్, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ బాష, బహదూర్ బాష, షేక్.ఇబ్రహీం, షేక్ హబీబ్, రియాజ్‌బేగ్, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

నేడు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎన్నిక

అమృతలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎన్నిక శనివారం జరగనున్నట్లు నీటిపారుదల శాఖ ఈఈ వెంకటరత్నం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు ఒంగోలు ఎస్ఈ అబూదలేమ్ పర్యవేక్షణలో ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. తొలుత నామినేషన్‌లు స్వీకరణ అనంతరం ఛైర్మన్ ఎంపిక జరుగుతుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ సహోదర ప్రేమ కలిగి జీవించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి
● ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, చిత్రంలో డాక్టర్ జి.చార్వాక తదితరులు

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి ఒక్కరు సహోదర ప్రేమ కలిగి జీవించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులో ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో శుక్రవారం జైభీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు చెల్లి అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రిస్మస్ ట్రీ వెలిగించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నిన్నువలే నీపొరుగువారిని ప్రేమించమని చెప్పిన ఏసుక్రీస్తుబోధనలు అనుసరించాలన్నారు. అనంతరం క్రిస్మస్ క్యాండీల్స్ ప్రదర్శన నిర్వహించి పేద వృద్ధ మహిళలకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు క్రిస్మస్ యాక్షన్ సాంగ్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఈబి విలియమ్స్, ఆర్డీవో పి.గ్లోరియా, నిర్వాహకులు నాగార్జున, కొండ్రు శ్రీకాంత్, జ్యోతిప్రసాద్, జంగం దాసు, కత్తి రాజు, ప్రశాంత్‌రాజు, సురేష్, ఆనంద్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్‌లో...

కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాలయంలో శుక్రవారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడ జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగి జీవించాలన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎఎస్‌పిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో...

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-వెలుగు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సెమీక్రిస్మస్ వేడుకలను బాపట్ల అంబేద్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పీడీ పి.పద్మ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. దైవసేవకులు ఆనందపాల్ క్రిస్మస్ సందేశం అందించారు. డీపీఎం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ఏసుక్రీస్తు ప్రేమ, దయను ప్రతి ఒక్కరు కలిగియుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, సమైక్య అధ్యక్షులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ భవన్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ తదితరులు

సీబీజెడ్ చర్చిలో....

పట్టణంలోని సీబీజెడ్ చర్చిలో శుక్రవారం స్త్రీల సమాజం వారు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రత్నకుమారి పాల్గొని క్రీస్తును స్తుతించి ఆరాధించటమే క్రిస్మస్ అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్యాండీల్ లైటింగ్ వెలిగించారు. పేద మహిళలకు చీరలను పంపిణి చేశారు. సీనియర్ సభ్యులను సన్మానించారు. స్త్రీల సమాజంవారు కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరులు ఎం.పవిత్రకుమార్, డిఎమ్ రాహుల్ దేవ్, జె.క్రిష్టాపర్, స్త్రీల సమాజం సెక్రటరి సీహెచ్ సుకన్య, ఏలీషారావు, సాధుహెర్బర్ట్, ప్రేమచంద్ తదితరులు పాల్గొని గ్రీటింగ్స్ చెప్పారు.

నేడు కొల్లూరులో...

కొల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం కొల్లూరులో నిర్వహిస్తున్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహ సమీపంలో సాయంత్రం ఆరు గంటలకు నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ తెలిపారు.

దుష్ప్రచారం చేయటం సరికాదు

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జైభీమ్ పార్టీ నాయకులు తమపై దుష్ప్రచారం చేయటం సరికాదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు అన్నారు. ఈ విషయమై శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు సంబంధించిన కట్టడాన్ని అక్రమ కట్టడంగా ప్రచారం చేయటం, ఇసుక క్వారీలు పెట్టి వ్యాపారం చేస్తున్నానని విమర్శలు చేయటం సరికాదన్నారు. అధికారులను, ప్రజలను బెదిరించి డబ్బులు వసూళ్ళు చేసే వాళ్ళు తనపై తప్పుడు విమర్శలు, ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. దళితులకు అన్యాయం చేస్తున్నాననే ఆరోపణలలో వాస్తవంలేదన్నారు. సమావేశంలో టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, పసుమర్తి యలమంద, దారా అశోక్, అడే వంశీ ఉన్నారు.

విద్యుత్ పొదుపుగా వాడుకోవాలి : జేసీ


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ నుంచి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ర్యాలీని ప్రారంభించి ఇంధన పొదుపు గురించి వివరించారు. ముఖ్యంగా ఏసీ వినియోగించేటప్పుడు 24పైనే పెట్టుకోవాలన్నారు. ఆఫ్ చేసినప్పుడు రిమోట్‌తో పాటు స్విచ్ కూడా ఆపుకోవాలని విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు తెలిపారు. కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, గడియార స్తంభంసెంటర్‌మీదగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. ప్లేకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బాపట్ల, చెరుకుపల్లి, పొన్నూరు ఏడీఈలు శ్రీనివాసరావు, విజయశ్రీనివాస్, శ్యామ్ కుమార్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న కన్నా

పిట్టలవానిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని శుక్రవారం మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఆలయ ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో కన్నా లక్ష్మీనారాయణకు అమ్మవారి దుశ్శాలువా, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చందోలు గ్రామ టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్ (దాదా), ఆలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలువలను జోడించటంతో లాభాలు పొందవచ్చు

● పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజి కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏడుకొండలు



మాట్లాడుతున్న పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజి కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏడుకొండలు

బాపట్ల,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో వ్యవసాయోత్పత్తులకు విలువలను జోడించటం ద్వారా రైతులు లాభం పొందవచ్చని పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజి కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు తెలిపారు. మండలంలోని కంకటపాలెం గ్రామంలో వ్యవసాయ కళాశాల పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజి కేంద్రం వారు శుక్రవారం వరిప్రాసెసింగ్‌లో ఉపకరించే మెషనరీలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ ఏడుకొండలు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతు స్థాయిలో వరిని ప్రాసెస్ చేసుకునేందుకు ఉపయోగించే చిన్న మిల్లింగ్ మెషనరీలు, రైస్ రవ్వ, రైస్‌పొడి తయారు చేసే యంత్రాలను ప్రయోగాత్మకంగా చూపించి వివరించారు. అలాగే రైతులు ఆర్గానిక పంటలను ఉత్పత్తి చేసి తక్కువ ఖరీదు యంత్రాల ద్వారా తమ పంటలను తాము ప్రాసెస్ చేసి అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వాసుదేవరావు, సందీప్‌రాజా, సునీల్‌చౌదరి, అబ్రహం, రత్నం, అభ్యుదయ రైతులు, సర్పంచ్ ఎం.వందనం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్‌ఐలు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు పోలీసుస్టేషన్‌లో నూతన ఏఎస్‌ఐలుగా బి.రామయ్య, డేవిడ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. చందోలు పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా రామయ్య పనిచేస్తూ ఏఎస్‌ఐగా ప్రమోషన్ పొందారు. డేవిడ్ చుండూరు పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులుగా నిర్వహిస్తూ బదిలీపై చందోలు పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐగా ప్రమోషన్ పొంది ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వీరిని చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది ప్రత్యేక అభినందనలుతెలిపారు.

పేదలకు అన్నదానం

పిట్టలవానిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామపంచాయతీకి చెందిన విద్యావేత్త, ప్రైవేట్ కళాశాల కరస్పాండెంట్ సయ్యద్ యాకుబ్ ఇటీవల అకాల మరణం పొందారు. శుక్రవారం వారి కుమారులు తెలుగుదేశం పార్టీ షైనార్టీ నాయకులు, మాజీ రైల్వేబోర్డుమెంబరు ఎస్ఎస్ మోసినియాజీ, చందోలు గ్రామ టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాంలు శుక్రవారం నిరుపేదలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఖాజా, ఆఫ్‌రత్, మహ్మద్‌ఖాశీం, మీరా, పిట్టలవానిపాలెం మండల జనసేన అధ్యక్షులు హుస్సేన్‌బేగ్, దరియా, సలీం, ఎండీ అరీఫ్, సాగర్, మౌలాబేగ్, దిలీప్, రషీద్ తదితరులు పాల్గొన్నారు

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి : డీటీ


సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ

నగరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కని వేదికగా ఉపయోగపడతాయని మండల డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. ఏలేటిపాలెంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 17 అర్జీలు అందాయని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వీపీ గోపాల్, వీఆర్‌వో గిరిజ, స్థానిక ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మండల తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామస్తులు పలు సమస్యలపై వినపతిపత్రాలను అందజేశారు. పలురకాల సమస్యలపై తహసీల్దార్, ఎంపీడీవోలు గ్రామప్రజలకు వివరణ ఇచ్చారు. ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ వచ్చిన వినతిపత్రాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుందరమ్మను కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి పి.వెంకటేశ్వరరావు, గ్రామ రెవెన్యూఅధికారి విజయకుమార్, గ్రామపెద్దలు మాడా శ్రీనివాసరావు, టీడీపీ ఇన్‌చార్జి మునిపల్లె చిన్న, గరిగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పల సేకరణకు టెండర్లు స్వీకరణ

అమృతలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈవో అశోక్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా అలయం వద్ద ఖాళీ స్థలం, కొబ్బరి చిప్పల సేకరణ, కొబ్బరి కాయలు అమ్ముకునే హక్కు నిమిత్తం ఈనెల 23వ తేదీన ఉదయం నుంచి టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు.

కొల్లూరులో శ్రీదత్త చరిత్ర పారాయణ సప్తాహ దీక్ష

కొల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీదత్త చరిత్ర పారాయణ సప్తాహ దీక్ష కార్యక్రమం ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలో ములుకుట్ల విశ్వనాథశర్మ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొట్లూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దీక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన కార్య నిర్వహణాధికారి నాగిశెట్టి శ్రీనివాసరావు, అర్చకులు రొంపిచర్ల కృష్ణమాచార్యులు అన్నారు.

వైసీపీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడిగా విష్ణుమొలకల

వేమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడిగా చావలి గ్రామానికి చెందిన విష్ణుమొలకల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం విడుదల చేసిన ప్రకటనలో వెంకటేశ్వరరావును బాపట్ల జిల్లా పార్టీ గ్రీవెన్స్ విభాగానికి అధ్యక్షుడిగా నియమించారు. ఆయన గతంలో వేమూరు జడ్పీటీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచనల మేరకు పార్టీ అధిష్టానం వెంకటేశ్వరరావుకు పార్టీ పదవి కేటాయించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వేమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి పోతుమర్రు ఫీడర్ పరిధిలో శనివారం మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గోపి తెలిపారు. చంపాడు, పోతుమర్రు, జంపని గ్రామాల గృహ విద్యుత్‌ను తిరిగి రెండు గంటలకు సరఫరా ఇవ్వబడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఆర్మీ ఉద్యోగి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆర్మీ ఉద్యోగి శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల పరిధిలోని ఐలవరం గ్రామానికి చెందిన గాలి శ్రీనివాసరావు (45) ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో భారత సైన్యంలో జూనియర్ కమిషనర్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా అనారోగ్యంగా ఉండటంతో అక్కడే ఉన్న ఆర్మీ వైద్యశాలలో చేరగా అక్కడి వైద్యులు శస్త్ర చికిత్సలు చేశారు. అప్పటి నుంచి వైద్యశాలలోనే చికిత్స పొందుతున్న ఉద్యోగి మృతి చెందినట్లు ఆర్మీ అధికారులు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహం శనివారం గ్రామానికి రానుందని అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారని సమాచారం.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బాపట్లరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :పేకాట స్థావరంపై వెదుళ్ళపల్లి పోలీసులు శుక్రవారం దాడి నిర్వహించారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ పి.జనార్దనరావు తెలిపిన వివరాలు ప్రకారం.. స్టూవర్టుపురం గ్రామశివారులో పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1470 స్వాధీనం చేసుకోవటంతోపాటు ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేయటం జరిగిందని ఎస్సై తెలిపారు.

చోరీపై కేసు నమోదు

అమృతలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జానకీఅమర్‌వర్ధన్ తెలిపారు. మండలంలోని మూల్పూరు జగనన్న కాలనీకి చెందిన మేరుగుమళ్ళ నరేంద్రకుమార్ దంపతులు గురువారం మధ్యాహ్నా పొలం వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికిరాగా ప్రహరీ గేటు వేసి ఉండగా ఇంటి తలుపు పగలకొట్టి ఉండటంతోపాటు బీరువా తలుపులు తీసి ఉన్నట్లు గమనించి పోలీసులు సమాచారం అందించారు. నరేంద్రకుమార్ పరిశీలించగా బీరువాలోని నల్లపూసల గొలుసు, రెండు పేటల నానుతాడు, ఒక చెవిదిద్ది, ఉంగరం చోరీకి గురైనట్లు గమనించి ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలు, తదితర వివరాలు సేకరించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సీతారామిరెడ్డి మృతి బాధాకరం

● ఎమ్మెల్యే ఆనందబాబు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేసిన గుదేటి సీతారామిరెడ్డి (77) మృతి బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుదేటి ఎల్లారెడ్డి తండ్రి, సీనియర్ టీడీపీ నాయకుడు సీతారామిరెడ్డి మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఆనందబాబు శుక్రవారం చుండూరులోని ఆయన నివాసానికి వచ్చి మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, వీరి కుటుంబం మొదటి నుంచి ఎన్నో అటుపోట్లు ఎదుర్కొంటూనే ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిందన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, శ్రీమాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమం పై దృష్టి పెట్టాలి

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి


సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంక్షేమంపై దృష్టిపెట్టాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు. బాపట్ల పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం సంక్షేమశాఖ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, గృహ సంక్షేమ, హాస్టల్, వైద్య, పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ వసతి గృహాలలో పిల్లలు హింస, మానసిక వేధింపులకు గురికాకుండా ప్రత్యేకమైన నిఘా వ్యవస్థను పనిచేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వసతిగృహాలలో ఫిర్యాదుబాక్స్‌లు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అవసరమైన మౌలికసదుపాయాలు కల్పించి క్రమశిక్షణ కలిగిన విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా, లేబర్ ఆఫీసర్ శివలీల, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

రేపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అహంకార వ్యాఖ్యలను దళిత సంఘాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం దళిత సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జైభీమ్‌రామ్ భారతపార్టీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దోవా రమేష్‌రాంజీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హోంశాఖా మంత్రి అమిత్‌షా చేసిన అహంకార వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రేపల్లె ఉపాధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ వెంటనే అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, కేంద్ర హోం శాఖ మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘనేతలు దారం సాంబశివరావు, కర్రా ప్రతాప్, తెనాలి దీనరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, డి.కృష్ణప్రసాద్, ఎస్.జోజి, ఎస్.సురేష్, కె.సుధీర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మహిళా న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది ఝాన్సీ

చెరుకుపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి మహిళ చట్టాలపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది ఝాన్సీ అన్నారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయసేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేకంగా చట్టాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, రిసోర్స్‌పర్సన్ కట్టా కాళిదాసు, ఎస్ఐ టి.అనిల్‌కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ భూమి ఆక్రమణ

రేపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిజాంపట్నం గ్రామంలో తుఫాన్ బాధితుల కోసం లయన్స్ క్లబ్ 1978లో 4.57 సెంట్ల భూమిని కొనుగోలు చేసి బాధితులకు గృహాలను నిర్మించి అందజేశారు. ఖాళీగా ఉన్న 40 సెంట్ల లయన్స్ క్లబ్ స్థలాన్ని ఇద్దరు స్థానికులు ఆక్రమించుకుని ఖాళీ చేయటం లేదంటూ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కలెక్టర్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి సమస్యను తీసుకుని వెళ్ళానని, వారి ఆదేశాలతో రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారన్నారు. నిజాంపట్నం తహసీల్దార్ సర్వేలో భూమి కొలిచేందుకు రాగా నిజాంపట్నానికి చెందిన స్థల ఆక్రమణదారుడు షేక్ గౌస్ అధికారులపై, తమపై ఇష్టానుసారంగా దుర్భాషలాడాడని, రౌడీయిజంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్ళామని, ఆయన సానుకూలంగా స్పందించి లయన్స్ క్లబ్‌కే స్థలాన్ని అప్పచెప్పేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారన్నారు. రూ.కోటి 70 లక్షలు విలువ చేసే స్థలాన్ని అన్యాక్రాంతంగా దోచుకుతిందామని రౌడీమూకలు వ్యవహరిస్తున్నారని తక్షణమే వారిపై అటు పోలీసులు, ఇటు రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకుని లయన్స్ క్లబ్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.

బాలికలకు కబడ్డీ శిక్షణ


వనజా చంద్ర పబ్లిక్ స్కూల్లో కబడ్డీ క్రీడాకారులు

చెరుకుపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలికల జిల్లా జూనియర్ జట్టు కబడ్డీ ప్లేయర్లకు మూడు రోజులుగా గూడవల్లిలోని శ్రీవనజా చంద్ర పబ్లిక్ స్కూల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్ ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు మూడు రోజులు కొనసాగాయి. ఈనెల 14న నరసరావుపేటలో నిర్వహించిన ఎంపికల్లో జిల్లా బాలికల జట్టుకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 22 నుంచి 24 వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు వీరంతా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోగినేని శ్వేత, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తేజస్వీని

స్వర్ణాంధ్ర సాధనలో యువతే కీలకం

- రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ బోడపాటి తేజస్వీని
- హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

గుంటూరు (విద్య), డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): దేశంలో 60 శాతంపైగా ఉన్న యువత, విద్యార్థులు స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో కీలకం కావాలనీ, అకుం ఠిత దీక్షతో పాలుపంచుకోవాలనీ, ఇందుకు చదువు తోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలను ఉపయోగించుకోవాలని రాష్ట్ర సృజనాత్మ కత, సాంస్కృతికవిభాగాల కమిషన్ చైర్ పర్సన్ బోడపాటి తేజస్విని అన్నారు. గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు "ఆదర్శ్ 2024 స్పోర్ట్స్ ఫర్ హార్మనీ"ను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. తేజస్విని తొలుత క్రీడోత్సవ పతాకాలు ఆవిష్కరించిన అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పావురాలను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు.

అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తేజస్విని మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ ఒలింపిక్స్ దేశంలో త్వరలో నిర్వహించుకోబోతున్న సందర్భంగా ప్రధాని మోదీ ఆశిస్తున్న అత్యున్నత క్రీడా ప్రమాణాలతో కూడిన క్రీడాకారులు తయారవ్వాలని కోరారు. క్రీడాకారులు, యువతరం డాక్టర్ అబ్దుల్ కలాం, సచిన్ టెండూల్కర్, పీవీ సింధు, హారిక లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించి తేజస్విని స్వయంగా ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఘనత వహించిన రమణరావు, ఎమ్మెస్కే ప్రసాద్ లాంటి జాతీయస్థాయి క్రీడాకారులు హిందూ విద్యా సంస్థలలో పూర్వ విద్యార్థులేనన్నారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న క్రీడోత్సవాలకు 25 కళాశాలల నుంచి 500 మంది ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్ ప్రసాద్ మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్స్ వంటి క్రీడలతోపాటు వారి మానసిక వికాసానికి దోహదపడే సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, డాక్టర్ కొల్లా సుస్మితా చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కోసూరి రవి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న తేజస్వినీ



విద్యార్థిని నృత్య ప్రదర్శన



క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న తేజస్వీని



విద్యార్థినీ, విద్యార్థుల మైమ్ ప్రదర్శన



పద్దెనిమిది ఏళ్లంటే ఏమీ తెలియని వయస్సు. ఆ వయస్సులోనే జిల్లాలోని బాలికలు భార్యలు వుతున్నారు. పద్దెనిమిది నిండే సరికి చంకలో ఓ బిడ్డ, కడుపులో మరో బిడ్డతో ఉసూరుమంటూ కన్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎడాపెడా జరుగుతున్న బాల్యవివాహాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఊరు, వాడా తేడా లేకుండా ఆడపిల్లలకు సరైన వివాహ వయస్సు రాకుండానే పెళ్లిళ్లు చేస్తున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఈ తరహా బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

బాల్య బంధనాలు

- ప్రమాద ఘంటికలు మోగిస్తున్న బాలిక వివాహాలు
- 291 మంది బాలికలు 18 ఏళ్ల లోపే గర్భవతులు
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కాకి లెక్కలు
- ఆరోగ్య శాఖ రికార్డులతో వెలుగులోకి నిజాలు


గుంటూరు సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే లెక్కకు మించిన సంఖ్యలో బాలికలు గర్భవతులు అవుతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ చెబుతుంది. 15 సంవత్సరాల వయస్సు నుంచి 18 సంవత్సరాలలోపు గర్భం దాల్చిన వారి సంఖ్య జిల్లాలో రికార్డు స్థాయిలో ఉండటం విశేషం. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్రం బాల్యవివాహాలు అరికడుతున్నట్లు కాకిలెక్కలు చెబుతోంది. బాల్యవివాహాల విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ లెక్కకు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లెక్కకు పొంతన ఉండటం లేదు.

ఆధార్‌తో అసలు లెక్క...

గర్భవతుల నమోదుకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుంది. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు కొత్తగా వివాహమైన జంటను ప్రతిరోజూ పర్యవేక్షించి నెల తప్పిన వారిని ఏఎన్ఎం దగ్గరకు తీసుకొస్తారు. అక్కడ తగిన పరీక్షలు నిర్వహించిన అనంతరం గర్భవతిగా నమోదు చేస్తారు. అందుకోసం ఆధార్ కార్డును తీసుకుని అందులోని వివరాలనే ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆవిధంగా నమోదు చేయడం ద్వారా జిల్లాలో చిన్న వయస్సులోనే గర్భవతులు అయిన వారి వివరాలు వెల్లడవుతున్నాయి. ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు నెల వరకు 291 మంది బాలికలు 18 ఏళ్లలోపే గర్భందాల్చారు. 15 ఏళ్లకే గర్భం దాల్చిన వారు 8 మంది, 16 ఏళ్లకు 24 మంది, 17 ఏళ్లకు 103 మంది, 18 ఏళ్లకు 155 మంది గర్భం దాల్చారు. వీరంతా ప్రస్తుతం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీకాలు పొందుతున్నారు.

పొంతనలేని లెక్కలు...


జిల్లాలో జరుగుతున్న బాల్య వివాహాలపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కూడా కొన్ని లెక్కలు సిద్ధం చేసింది. కానీ అవేవీ వాస్తవానికి దగ్గరగా లేవు. బాల్య వివాహాలు తాము నిలిపివేయించినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్న మాటల్లో వాస్తవం లేనట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటి వరకు 35 బాల్య వివాహాలు నిలుపుదల చేసినట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఆ శాఖకు చెందిన ఆరు ప్రాజెక్టులకుగానూ పొన్నూరు, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోనే ఎక్కువ బాల్యవివాహాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. ఉదాహరణకు పెదనందిపాడు మండలం ఉప్పలపాడుకు చెందిన బాలికకు వివాహం జరుగుతుండగా ఆపివేసినట్లు రికార్డులో చూపించారు. వాస్తవానికి ఆ బాలికకు వివాహం జరిగింది. గుంటూరు నగర పరిధిలోని మరో బాలిక వివాహం అడ్డుకున్నట్లు చెబుతున్నా, ఆ బాలికకు కూడా వివాహం జరిగింది. ఆ శాఖ చెప్పిన చాలా మంది బాలికలకు వివాహాలు జరిగిపోయాయి.



అన్నీ ఇబ్బందులే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న వివరాల ప్రకారం 15 నుంచి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు, బాలికల మరణానికి గర్భం దాల్చటమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆ వయస్సులో పెళ్లి, గర్భం అంటే ఆడపిల్ల జీవితానికి బలవంతపు మరణ శాసనం రాసినట్లు భావించాలి. ఎదిగీ ఎదగని వయస్సులో బిడ్డలకు జన్మనివ్వటం వలన అనేక రకాల భౌతిక, మానసిక, ఆరోగ్య సమస్యలు బాలికలను చుట్టుముడుతున్నాయి. అందువల్లే బాల్యవివాహాలను నిరోధించేందుకు ప్రభుత్వం 2006లో ప్రత్యేక చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. అయినా బాల్యవివాహాలు ఆగకపోవటం సామాజిక సమస్యగా పరిణమిస్తోంది.

పాఠశాల స్థాయిలోనే జరుగుతున్న ప్రేమ వ్యవహారాల వల్ల జిల్లాలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో జరిగిన అనేక బాల్యవివాహాల నేపథ్యం ప్రేమ వ్యవహారమే కనిపిస్తుంది. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత వంటివి బాల్యవివాహాలను ప్రోత్సహిస్తున్నాయి.



ప్రక్షాళన దిశగా రిజిస్ట్రేషన్!

(5వ పేజీ తరువాయి..)

కూడా నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం చెబుతుండగా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని రిజిస్ట్రేషన్ శాఖ చెప్పడం కొంత గందరగోళానికి దారి తీస్తోంది

నకిలీ వీలునామాలతో ఎంతో మందిని బాధితులుగా..

నకిలీ వీలునామాలు సృష్టించి ఎంతోమందిని ఆస్తి వివాదాలలోకి లాగి ఆపై వారే సెటిల్మెంట్ చేసే దందాలు గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగాయి. తమ అడుగులకు మడుగులొత్తే సబ్‌రిజిస్ట్రార్ల ద్వారా ఈ అడ్డగోలు వ్యవహారాలను వైసీపీ నేతాగణం పెద్ద ఎత్తున నడిపించింది. ఇలాంటి వాటికి గత ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల సంఖ్యే దాదాపు 180 వరకు ఉన్నాయంటే ఏరీతిన సదరు విభాగాన్ని భ్రష్టుపట్టించారో అవగతమవుతోంది. ఈ నకిలీ వీలునామాలపై వచ్చిన ఫిర్యాదులతో పాటు ఆ సమయంలో అక్కడ పనిచేసిన వారి వివరాలు, వాటిలో సహేతుకత ఎంత అని తేల్చే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమయి ఉంది. ఇది పారదర్శకంగా జరిగితే ఎంతో మంది బాధితులకు ఊరట చేకూరడంతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ ప్రక్షాళనలో గొప్ప అడుగుకు శ్రీకారం చుట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది

ఈ-స్టాంపింగ్‌పై పునరాలోచన..

కొన్ని దశాబ్దాలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులనే రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతరత్రా వ్యవహారాలకు ఉపయోగించడం ఆనవాయితీగా వస్తోంది. గత ప్రభుత్వం వాటిని తెప్పించలేని దురవస్థలో ఈ -స్టాంపింగ్ అంటూ కొత్త పల్లవి ఎత్తుకుని ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసింది. ఈ విధానంపై అప్పట్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చినా అప్పటి ప్రభుత్వం ఖాతరు చేయకపోగా మొండిగా ముందుకే వెళ్లింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాత విధానాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది కాకపోతే ఇస్టాంపింగ్ రద్దుపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

మార్కెట్ విలువ పెంపులో ఏకపక్షంగా..

రిజిస్ట్రేషన్ శాఖను కేవలం ఆదాయ వనరుగానే చూసిన గత ప్రభుత్వం ఎక్కడా పారదర్శకతకు అవకాశం లేకుండా ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యమిచ్చింది. దీనిలో భాగంగానే భూముల, భవనాల విలువను బహిరంగమార్కెట్‌కంటే రెండుమూడు రెట్లు అమాంతం పెంచి ప్రజల నడ్డి విరిచింది. ఈ రూపేణా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖకు దక్కిన అదనపు ఆదాయం అక్షరాల రూ.250 కోట్లకు పైమాటే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ విలువ పెంచే ఆలోచన చేస్తుంది. కాకపోతే సవరించిన విలువలను సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయంలోని నోటీసు బోర్డుల్లో రెండు వారాల పాటు ఉంచి ప్రజల అభిప్రాయం కూడా తీసుకెళ్లాలన్న తలంపులో కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. మార్కెట్ విలువ పెంపుపై ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలకు కూడా తగు ప్రాధాన్యమిచ్చి నిర్ణయం తీసుకోవాలని ప్రభుతత్వం భావిస్తోంది

అవినీతి కూపాలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు..

ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో ఏ ఒక్క వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ అవినీతికి కేరాఫ్‌గా మారాయి. వీటిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అయితే ఈ అవినీతి చిట్టాలకు అంతే ఉండదు. ఏసీబీ దాడుల్లో ఎక్కువ శాతం పట్టుబడేది రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులే కావడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఏసీబీ కోరలు కూడా దాదాపుగా పీకేసి మొక్కుబడి సోదాలు తప్ప చిత్తశుద్ధితో పనిచేసిన దాఖలాలు లేవు. గడచిన ఐదు సంవత్సరాల వ్యవధిలో ఏసీబీ దాడుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పట్టుబడిన రిజిస్ట్రేషన్ సిబ్బంది 15కులోపుగానే ఉండడం ఏసీబీ అధ్వాన పనితీరుకు అద్దం పడుతోంది. ప్రస్తుత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని భావిస్తోంది. దానిలో భాగంగా తొలుత ఆయా కార్యాలయాల్లో ఉన్న అవినీతి తిమింగలాల జాబితాను తయారు చేసే పనిలో ఉంది. త్వరలోనే వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించడంతో పాటు సిబ్బంది విషయంలో కూడా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టనుంది.

అగ్రీ పరీక్షలు.. అంతంత మాత్రమే

(5వ పేజీ తరువాయి..)

సామర్థ్యం పరీక్షల పై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఏఓ చెయ్యాల్సిన పరీక్షలను ఏఈఓలతో చేయించి తూతూమంత్రంగా రిపోర్టులు ఇస్తున్నారన్న వాదన వినిపిస్తోంది.

వృథా ప్రయాస...

ల్యాబుల్లో లర్హత కలిగిన అధికారులను నియమించకపోవటం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయిలో చేస్తున్న తనిఖీలు కూడా అభాసుపాలవుతున్నాయి. వాస్తవానికి ప్రతి వ్యవసాయ శాఖ అధికారి వారి పరిధిలో ప్రతి నెలా విత్తనాలు, ఎరువులకు సంబంధించి కొన్ని నమూనాలు సేకరించాలి. సేకరించిన నమూనాలను మొదట రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడ వాటిని డీకోడ్ చేసి నియోజకవర్గ పరిధిలోని ల్యాబులకు పంపుతున్నారు.ఇక్కడ వాటికి పరీక్షలు నిర్వహించి మంచివి అని నిర్ధారిస్తేనే అమ్మకాలు జరుగుతాయి. అటువంటి కీలకమైన నిర్ధారిత పరీక్షలు కింది స్థాయి సిబ్బంది తో చేయించటం విమర్శలకు తావిస్తోంది.

మొలవక పోయినా మంచివనే రిపోర్ట్

ఈ మధ్య కాలంలో నకిలీ విత్తనాలు బెడద బాగా పెరిగిపోయింది. అటువంటప్పుడు కొన్ని విత్తనాల కంపెనీలపై అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. విచిత్రంగా ల్యాబ్ పరీక్షల్లో అవి మంచివని తేలుతుంది. ఇటువంటి రిపోర్ట్ లపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. సరైన అవగాహన లేకుండానే కింది స్థాయి సిబ్బంది తో పరీక్షలు నిర్వహించి మొక్కుబడిగా రిపోర్ట్ ు ఇస్తున్నారు. కొన్ని పెద్ద కంపెనీలు నమూనాలు ఎక్కడికి వెళ్లాయో తెలుసుకొని కింది స్థాయి సిబ్బంది ద్వారా అనుకూలంగా రిపోర్టులు తెప్పించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరీక్ష లపై శిక్షణ కూడా లేదు...

వాస్తవానికి ఒక వేళ ఏఈఓ లతో ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని భావిస్తే వారికి ముందుగా శిక్షణ ఇవ్వాలి. గత మూడేళ్ళుగా ఉమ్మడి జిల్లాలో అటువంటి శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించలేదు.

పరీక్షా కాలమ్




పరిశీలన, అవగాహన, సృజనతో అత్యధిక మార్కులు సాధ్యం

'పదో తరగతి విద్యార్థులు సాంఘిక శాస్త్రం సబ్జెక్టు అంటే భయపడుతుంటారు. అలాగే కొంతమంది ఈ సబ్జెక్టును చాలా తేలికగా తీసుకుంటారు. ఇది సరైన విధానం కాదు. కొద్దిగా కష్టపడితే ఈ సబ్జెక్టులో గణితంతో పాటు దీటుగా మంచి మార్కులు తెచ్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అని చెబుతున్నారు బీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రత్తిపాడు(గుంటూరు) స్కూల్ అసిస్టెంట్ డీ. కుసుమకుమార్.

గుంటూరు (విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంఘిక శాస్త్రంలో ప్రధానంగా మ్యాపులు, చరిత్ర, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం వంటి కీలక అంశాలకు సంబంధించిన పాఠాలు ఉంటాయి. విద్యార్థులు వాటి అభ్యసనపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాలి. ఒక ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధం అయితే సాంఘికశాస్త్రంలో అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది. కొంత మందికి ఈ సబ్జెక్టు కొరుకుడు పడని విధంగానే ఉంటుంది.. అయినా కొద్దిగా శ్రద్ధ చూపితే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

- తొలుత విద్యార్థులు సబ్జెక్టు పట్ల సరైన దృక్పథం కలిగి ఉండాలి. సాంఘిక శాస్త్రంలో ప్రస్తుతం నాలుగు పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. ఇందులో చరిత్ర, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం, ఆర్థిక శాస్త్రానికి సమాన ప్రాధాన్యం ఉంది.
- ఇందులో ప్రతి అంశాలనికి 25 మార్కులకు ప్రశ్నలు చొప్పున మొత్తం 100 మార్కులకు పేపర్ ఇస్తారు. ముందుగా సిలబస్‌ను ఒక క్రమ పద్ధతిలో విభజన చేసి ప్రణాళికతో రివిజన్ చేయాలి.
- సెక్షన్ 1లో భిన్న రకాల బిట్స్ ఇస్తారు. ఇవి నాలుగు సబ్జెక్టు మీద ఉంటాయి. సమాచార నైపుణ్యాల పై పట్టు సాధించాలి. భూగోళం, అర్థశాస్త్రంలో చర్చించిన సమస్యలు ఉంటాయి. ఉదాహరణకు వనరులు, వాటి వినియోగం, సంరక్షించుకోవడం తదితర అంశాలు ఉంటాయి. వాటిపై పూర్తి అవగాహన ఉండాలి. ఇంకా జల వనరులు, వాటి సంరక్షణ, కాలుష్యం నుంచి రక్షించుకోవడం వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- ఫలితాలు, సమస్యా నివారణలను పూర్తిగా అవగాహన చేసుకోవాలి. ఉదాహరణకు భారతదేశ, ప్రపంచంలో ఉన్న సమాచారంపై ప్రశ్నలు వస్తాయి. ఆయా భౌగోళిక పటాలపై సమాచారంతో కూడిన అవగాహన ఉండాలి.
- సమస్యలను ఇచ్చి సొంతంగా ప్రతి స్పందనలను నమోదు చేయండి.. అంటే అలాంటి వాటికి సమాధానాలు ఇచ్చే విధంగా తర్ఫీదు పొందాలి. ఉదాహరణకు.. మీకు పత్తి బాగా పండింది. అయితే ధర లేదు.. మీరు ఏం చేస్తారు. వంటి ప్రశ్నలు ఇస్తారు. అంటే వ్యవసాయం, రైతుల పరిస్థితిపై అవగాహన ఉండాలి
- పట్టికలను, గ్రాఫులను ఇచ్చి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. వాటిని సరిగ్గా అర్థం చేసుకోని సమాధానాలు రాయాల్సి ఉంటుంది. జనాభా లెక్కలు, వ్యాధులు, రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి. ఆర్థిక పరమైన అంశాలు వంటి పట్టికలు, గ్రాఫులు వచ్చే అవకాశం ఉంది.
- ఒక ముఖ్యమైన పేరాగ్రాఫ్ ఇచ్చి వాటిలో ముఖ్యమైన అంశాలపై కామెంట్ చేయమని అడుగుతారు. ఇలా విద్యార్థిలో సృజనాత్మకత, పరిశీలన, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ వంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టకుని ప్రశ్నలు ఉంటాయి. ఇలాంటి సొంత ప్రతి స్పందనలపై ప్రశ్నలు వస్తాయి.
- చివరగా విద్యార్థి పరీక్షా కేంద్రంలోకి వెళ్ళగానే ముందుగా ప్రశ్నపత్రాన్ని పూర్తిగా ఒకటికి రెండుసార్లు చదువుకోవాలి. ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రావాలి. ప్రశ్న పత్రంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి. పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రంలోనే ఉండాలి. జవాబు పత్రాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. తప్పులు ఉంటే సరిచేసుకోవాలి



డీ సుకుమకుమార్, స్కూల్ అసిస్టెంట్, బివిఆర్ జడ్పీస్కూల్ ప్రత్తిపాడు (గుంటూరు)

నాలుగుపళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా ఎడ్ల జత ప్రథమం

- కొనసాగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

గురజాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని గురజాల పట్టణంలోని నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో శుక్రవారం నాలుగుపళ్ల విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4780.7 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది.

అలాగే పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చాగంటి శ్రీనివాసరావు ఎడ్లజత 4600 అడుగులతో సంయుక్తంగా రెండోస్థానం, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత 4230.10 అడుగులతో మూడోస్థానం, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన వీరంరెడ్డి కార్తీక్‌రెడ్డి ఎడ్లజత 4024.8 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేలం పద్మనాయుడు ఎడ్లజత 3933.3 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి.



నాలుగుపళ్ల విభాగంలో ప్రథమస్థానం సాధించిన ప్రకాశం జిల్లా ఎడ్లజత

స్కేటర్ జెస్సీరాజ్‌కు కేంద్ర ప్రభుత్వ పురస్కారం

- ప్రత్యేకంగా అభినందించిన రాష్ట్ర మంత్రి లోకేశ్

మంగళగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్‌కు ప్రతిష్ఠాత్మకమైన ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అవార్డు లభించింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనుంది. జెస్సీరాజ్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నుంచి ఆసియా కప్, ప్రపంచ కప్ పోటీల్లో రాణిస్తూ దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసింది. ఇప్పటివరకు 50 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. ఈ ఏడాది న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియానిక్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. జెస్సీరాజ్‌ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌ను ప్రతి ఏటా దేశంలోని 25 మంది చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. వివిధ అంశాల్లో విభిన్న ప్రతిభ చూపిన చిన్నారులను జ్యూరీ పారదర్శకంగా ఈ పురస్కారానికి ఎంపిక చేస్తుంది. 2025 సంవత్సరానికి సంబంధించి కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాబితాను ప్రకటించింది. క్రీడా విభాగంలో జెస్సీ రాజ్ పేరును ఎంపిక చేయడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్ జెస్సీరాజ్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ఈ ఏడాది కేంద్ర బాల పురస్కార్‌కు జెస్సీరాజ్‌ను ఎంపిక చేయాలని కోరుతూ మంత్రి లోకేశ్ కేంద్రానికి లేఖ రాశారు. మంత్రి లోకేశ్ చొరవతో కేంద్రం ఈ అవార్డుకు ఎంపిక చేసిందని జెస్సీరాజ్ తల్లిదండ్రులు రాధ, సురేష్ తెలిపారు.



మంత్రి లోకేశ్‌తో జెస్సీరాజ్

ప్రక్షాళన దిశగా 'రిజిస్ట్రేషన్'...!

(5వ పేజీతరువాయి)
కూడా నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం చెబుతుండగా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని రిజిస్ట్రేషన్ శాఖ చెప్పడం కొంత గందరగోళానికి దారి తీస్తోంది

నకిలీ వీలునామాలతో ఎంతోమందిని బాధితులుగా....

నకిలీ వీలునామాలు సృష్టించి ఎంతోమందిని ఆస్తి వివాదాలలోకి లాగి ఆపై వారే సెటిల్మెంట్ చేసే దందాలు గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగాయి. తమ అడుగులకు మడుగులొత్తే సబ్‌రిజిస్ట్రార్ల ద్వారా ఈ అడ్డగోలు వ్యవహారాలను వైసీపీ నేతాగణం పెద్ద ఎత్తున నడిపించింది. ఇలాంటి వాటికి గత ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల సంఖ్యే దాదాపు 180 వరకు ఉన్నాయంటే ఏరీతిన సదరు విభాగాన్ని భ్రష్టుపట్టించారో అవగతమవుతోంది. ఈ నకిలీ వీలునామాలపై వచ్చిన ఫిర్యాదులతో పాటు ఆ సమయంలో అక్కడ పనిచేసిన వారి వివరాలు, వాటిలో సహేతుకత ఎంత అని తేల్చే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమయి ఉంది. ఇది పారదర్శకంగా జరిగితే ఎంతో మంది బాధితులకు ఊరట చేకూరడంతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ ప్రక్షాళనలో గొప్ప అడుగుకు శ్రీకారం చుట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది

ఈ-స్టాంపింగ్ విధానంపై పునరాలోచన....

కొన్ని దశాబ్దాలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులనే రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతరత్రా వ్యవహారాలకు ఉపయోగించడం ఆనవాయితీగా వస్తోంది. గత ప్రభుత్వం వాటిని తెప్పించలేని దురవస్థలో ఈ -స్టాంపింగ్ అంటూ కొత్త పల్లవి ఎత్తుకుని ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసింది. ఈ విధానంపై అప్పట్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చినా అప్పటి ప్రభుత్వం ఖాతరు చేయకపోగా మొండిగా ముందుకే వెళ్లింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాత విధానాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది కాకపోతే ఇస్టాంపింగ్ రద్దుపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

మార్కెట్ విలువ పెంపులో ఏకపక్షంగా....

రిజిస్ట్రేషన్ శాఖను కేవలం ఆదాయ వనరుగానే చూసిన గత ప్రభుత్వం ఎక్కడా పారదర్శకతకు అవకాశం లేకుండా ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యమిచ్చింది. దీనిలో భాగంగానే భూముల, భవనాల విలువను బహిరంగమార్కెట్‌కంటే రెండుమూడు రెట్లు అమాంతం పెంచి ప్రజల నడ్డి విరిచింది. ఈ రూపేణా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖకు దక్కిన అదనపు ఆదాయం అక్షరాల రూ.250 కోట్లకు పైమాటే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ విలువ పెంచే ఆలోచన చేస్తుంది. కాకపోతే సవరించిన విలువలను సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయంంలోని నోటీసు బోర్డుల్లో రెండు వారాల పాటు ఉంచి ప్రజల అభిప్రాయం కూడా తీసుకెళ్లాలన్న తలంపులో కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. మార్కెట్ విలువ పెంపుపై ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలకు కూడా తగు ప్రాధాన్యమిచ్చి నిర్ణయం తీసుకోవాలని ప్రభుతత్వం భావిస్తోంది

అవినీతి కూపాలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు...

ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో ఏ ఒక్క వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ అవినీతికి కేరాఫ్‌గా మారాయి. వీటిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అయితే ఈ అవినీతి చిట్టాలకు అంతే ఉండదు. ఏసీబీ దాడుల్లో ఎక్కువ శాతం పట్టుబడేది రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులే కావడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఏసీబీ కోరలు కూడా దాదాపుగా పీకేసి మొక్కుబడి సోదాలు తప్ప చిత్తశుద్ధితో పనిచేసిన దాఖలాలు లేవు. గడచిన ఐదు సంవత్సరాల వ్యవధిలో ఏసీబీ దాడుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పట్టుబడిన రిజిస్ట్రేషన్ సిబ్బంది 15కులోపుగానే ఉండడం ఏసీబీ అధ్వాన పనితీరుకు అద్దం పడుతోంది. ప్రస్తుత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని భావిస్తోంది. దానిలో భాగంగా తొలుత ఆయా కార్యాలయాల్లో ఉన్న అవినీతి తిమింగలాల జాబితాను తయారు చేసే పనిలో ఉంది. త్వరలోనే వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించడంతో పాటు సిబ్బంది విషయంలో కూడా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టనుంది.

ఆర్టీసీలో డోర్ డెలివరీ సేవలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 20: ఆంధ్రజ్యోతి: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీసేవలను విజయంతం చేయాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదురు గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. కార్గో డోర్ డెలివరీ ద్వారా డిపోకు 10 కి.మీ దూరం వరకు డోర్ డెలివరీ చేస్తారన్నారు. ఉద్యోగులు బాధ్యతతో డోర్‌డెలివరీ బుకింగ్స్ చేయాలన్నారు.

భూభారం!



పెరగనున్న భూముల విలువలు
బహిరంగ మార్కెట్‌కు సమాంతరంగా ధరలు
వచ్చేనెల 1 నుంచి అమలు
గ్రామీణ ప్రాంతాలలో 20శాతం
పట్టణ ప్రాంతాలలో 5శాతం వరకు పెంపు
పెంచవద్దంటున్న ప్రజాప్రతినిధులు
ఇక నుంచి భారంకానున్న రిజిస్ట్రేషన్లు
ఇప్పటికే పడిపోయిన రియల్ రంగం

జనంపై మరో భారం పడనుంది. సాధారణ రివిజన్‌లో భాగంగా భూముల విలువలను ప్రభుత్వం పెంచబోతుంది. వచ్చేనెల 1 నుంచి అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న భూముల విలువలను పరిగణనలోకి తీసుకుని రివిజన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఇప్పటికే రెవెన్యూ అధికారుల నుంచి కమర్షియల్ భూములుగా మార్పుచేసిన వాటి వివరాలు తెప్పించుకొని సబ్‌రిజిస్ట్రార్లు ప్రాథమిక నివేదికలు తయారుచేశారు. పట్టణ ప్రాంతాలలో 5శాతం, గ్రామీణ ప్రాంతాలలో 20శాతం భూముల విలువ పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ చార్జీలపై పడనుంది.

ఒంగోలు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూముల విలువ పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువకు సమాంతరంగా ఉండాలనే ఆలోచనతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ముసాయిదాను సిద్ధం చేశారు. అందుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న భూముల మార్కెట్ విలువల కమిటీ పలుమార్లు సమావేశమైంది. ఈమేరకు 5శాతం నుంచి 20శాతం వరకు విలువలు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి, గామీణ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి భూముల విలువను రివిజన్ చేస్తారు అయితే 2019 సాధారణ రివిజన్ జరిగింది. 2020లో పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు 20శాతం పెంచారు. 2023లో స్పెషల్ రివిజన్ పేరుతో పట్టణ, మండలకేంద్రాలతోపాటుగా ముఖ్యమైన గ్రామాలలో కూడా భూముల ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఇప్పటికే కుదేలైన రియల్ రంగం

మరలా ఈ ఏడాది సాధారణ రివిజన్ పేరుతో భూముల ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ మేరకు అధికారయత్రాగం కసరత్తు చేపట్టింది. అయితే ప్రజాప్రతినిధుల నుంచి మాత్రం ధరలు పెంచవద్దని వినతులు అందుతున్నాయి. గిద్దలూరు ఎమ్మెల్యే భూముల విలువ పెంచవద్దని రిజిస్ట్రేషన్ అధికారులకు లేఖ రాశారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. గత రెండేళ్లుగా భూముల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పడిపోయాయి. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 50శాతానికి రిజిస్ట్రేషన్ దస్తావేజుల సంఖ్య పడిపోయింది. జిల్లాలో ఈ ఏడాది రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.502 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా ఇప్పటికి రూ.242 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే 50శాతం కూడా పూర్తి కాలేదు. ఆదాయం తగ్గడానికి రియల్ రంగం దెబ్బతినడమే కారణమని రిజిస్ట్రేషన్ అధికారులే అంటున్నారు. ఈ నేపథ్యంలో భూములు విలువ పెంచడం వలన రిజిస్ట్రేషన్లు మరింత తగ్గుతాయని రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాల్లో 5, గ్రామీణంలో 20శాతం పెరిగే అవకాశం

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో భూముల విలువ భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాలలో 5 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 20శాతం భూముల విలువ పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూముల విలువ పెరిగితే అదేస్థాయిలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయి. అలాగే జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులు పక్కన ఉన్న భూముల విలువ పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో కూడా స్వల్పంగా పెంచాలని ప్రాథమికంగా నివేదికలు సిద్ధం చేశారు. ఒంగోలు నగరంతోపాటుగా నగర పంచాయతీలు, మండలకేంద్రాలు, ముఖ్యమైన గ్రామాలలో భూములు విలువ పెరగనున్నాయి. అందుకు సంబంధించి జిల్లా కమిటీలో చర్చించి భూముల విలువ పెంచనున్నారు.

24 వరకు అభ్యంతరాలు తెలియజేయవచ్చు: జిల్లా రిజిస్ట్రార్

జిల్లాలో సాధారణ రివిజన్ మేరకు భూముల విలువలు పెంచనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆళ్ల బాలాంజనేయులు తెలిపారు. పెంచిన భూముల ధరలను సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ఐజీఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 24లోపు ఆధారాలతో తెలియజేయాలని కోరారు. 26న జిల్లా కమిటీ సమావేశమై తిరిగి పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటుందన్నారు. వచ్చేనెల 1 నుంచి రివిజన్ చేసిన ధరలు అమలులోకి వస్తాయన్నారు.

రిజిస్ట్రేషన్ అధికారులు సిద్ధం చేసిన ముసాయిదా ఇలా..

- లాయర్‌పేటలో గజం రూ.29వేలు ఉండగా రూ.30వేలు
- కొండయ్య బంకు వీధిలో గజం రూ.22వేలు కాగా రూ.24వేలు
- రాజపానగల్ రోడ్డులో ప్రస్తుతం రూ.30వేలు కాగా రూ.32వేలు
- పెళ్నూరు కోటవీధిలో రూ.5,400 కాగా రూ. 6వేలకు పెంచేందుకు సిద్ధమయ్యారు.
- ముక్తినూతలపాడులో ఎకరా రూ.40లక్షలు కాగా రూ.42 లక్షలు
- కొత్తపట్నం మండలం అల్లూరులో ఎకరా రూ.9లక్షలు ఉండగా రూ.10లక్షలు
- యరజర్లలో రూ.5.5లక్షలు ఉండగా రూ.6లక్షలు
- మామిడిపాలెంలో రూ.37 లక్షలు ఉండగా రూ.39 లక్షలు
- కంభం టౌన్‌లో గజం రూ.6వేలు కాగా రూ.6200లకు పెంచుతారు
- కంభం ప్రాంతంలో ఎకరం రూ.1.10లక్షలు కాగా రూ1.20 లక్షలు పెంచేందుకు ప్రాథమికంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా మార్కెట్ విలువల కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. బుధ, గురువారాలు జాయింట్ కలెక్టర్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అవసరమైన చోట మాత్రమే ధరలు పెంచాలని సూచనలు చేశారు. అందుకనుగుణంగా మార్పులు చేర్పులు చేసున్నారు.

అగ్రీ పరీక్షలు.. అంతంతమాత్రమే

(5వ పేజీతరువాయి)
సామర్థ్యం పరీక్షల పై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఏఓ చెయ్యాల్సిన పరీక్షలను ఏఈఓలతో చేయించి తూతూమంత్రంగా రిపోర్టులు ఇస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. పరీక్షలు ఏఈఓలు నిర్వహించి, రిపోర్ట్ మాత్రం ఏఓ పేరుతో ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని అంటున్నారు.

వృధా ప్రయాస...

ల్యాబుల్లో లర్హత కలిగిన అధికారులను నియమించకపోవటం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయిలో చేస్తున్న తనిఖీలు కూడా అభాసు పాలవుతున్నాయి. వాస్తవానికి ప్రతి వ్యవసాయ శాఖ అధికారి వారి పరిధిలో ప్రతి నెలా విత్తనాలు, ఎరువులకు సంబంధించి కొన్ని నమూనాలు సేకరించాలి. సేకరించిన నమూనాలను మొదట రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడ వాటిని డీకోడ్ చేసి నియోజకవర్గ పరిధిలోని ల్యాబులకు పంపుతున్నారు.ఇక్కడ వాటికి పరీక్షలు నిర్వహించి మంచివి అని నిర్ధారిస్తేనే అమ్మకాలు జరుగుతాయి. అటువంటి కీలకమైన నిర్ధారిత పరీక్షలు కింది స్థాయి సిబ్బంది తో చేయించటం విమర్శలకు తావిస్తోంది.

మొలవక పోయినా మంచివనే రిపోర్ట్

ఈ మధ్య కాలంలో నకిలీ విత్తనాలు బెడద బాగా పెరిగిపోయింది. అటువంటప్పుడు కొన్ని విత్తనాల కంపెనీలపై అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. విచిత్రంగా ల్యాబ్ పరీక్షల్లో అవి మంచివని తేలుతుంది. ఇటువంటి రిపోర్ట్ లపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. సరైన అవగాహన లేకుండానే కింది స్థాయి సిబ్బంది తో పరీక్షలు నిర్వహించి మొక్కుబడిగా రిపోర్ట్ ు ఇస్తున్నారు. కొన్ని పెద్ద కంపెనీలు నమూనాలు ఎక్కడికి వెళ్లాయో తెలుసుకొని కింది స్థాయి సిబ్బంది ద్వారా అనుకూలంగా రిపోర్టు లు తెప్పించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరీక్ష లపై శిక్షణ కూడా లేదు...

వాస్తవానికి ఒక వేళ ఏఈఓ లతో ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని భావిస్తే వారికి ముందుగా శిక్షణ ఇవ్వాలి. గత మూడేళ్ళుగా ఉమ్మడి జిల్లాలో అటువంటి శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించలేదు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అందుకోసం వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం ధాన్యం సేకరణపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వర్షాల నుంచి పంట ఉత్పత్తులను రైతులు కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టలను అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని అధికారులు మరింత చురుకుగా వ్యవహరిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం ఎంత? ఇప్పటివరకు ఎంత మోతాదులో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చారు. ఇంకెంత రావాల్సి ఉందనే అంశాలపై అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. అంతకు ముందు సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును వివరించారు. ఈ నెల రెండోవారం నాటికి 216, మూడవ వారానికి 564 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు తెలిపారు .ఇప్పటివరకు రూ.1.41 కోట్ల నగదును రైతుల ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రేషన్ దుకాణాల్లో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులను జనవరి 15 నాటికి భర్తీచేయాలన్నారు. రేషన్ బియ్యానికి సంబంధించిన అక్రమాలపై 6(ఏ) కేసులు నమోదు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బియ్యం పక్కదారి పట్టకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడే రైస్‌మిల్లులు, వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు పద్మశ్రీ, శ్రీనివాసరావు, గోపిచంద్, రమణ, ఉపేంద్ర, సుభాషిణి పాల్గొన్నారు.

ఆ వైద్యాధికారికి అందలం

మహిళా ఉద్యోగులను వేధించడంతో సరెండర్
ఆ వెంటనే పైస్థాయిలో వ్యవహారం
నడిపి మళ్లీ జిల్లాకే
జిల్లాకేంద్ర కార్యాలయంలో
అన్నీతానై నడుపుతున్న వైనం
కూటమి ప్రభుత్వం వచ్చినా వైద్యశాఖ
ఉన్నతాధికారుల్లో రాని మార్పు

ఒంగోలుకలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయన ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి. తన వద్ద పనిచేసే మహిళా ఉద్యోగులపై కన్నేస్తారు. వారు చెప్పినట్లు వినకపోతే వేధింపులకు పాల్పడుతారు. ఆ వేధింపులు భరించలేని ఆ మహిళా ఉద్యోగులు అందరూ ఒక్కటై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన అధికారులు ఆ వైద్యాధికారి చేస్తున్న వికృత చేష్టలు నిజమేనని తేల్చి గట్టుచప్పుడు కాకుండా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విజయవాడ కార్యాలయానికి సరెండర్ చేశారు. సాధారణంగా అటువంటి డాక్టర్ చేస్తున్న వికృత క్రీడలను బయటకు రాకుండా మామూళ్లు తీసుకొని ఆ శాఖ అధికారులు కాపాడుకుంటూ వస్తున్నారు. ఇదీ పశ్చిమ ప్రాంతంలోని ఒక మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో జరిగిన వ్యవహారం. కానీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఏమి జరిగిందో తెలియదు కానీ వారంరోజుల్లోనే తిరిగి వైద్య ఆరోగశాఖకు ఆ డాక్టర్‌ను డిప్యుటేషన్ వేశారు. వాస్తవంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటే కనీసం మరొక జిల్లాలో నియమిస్తారు. కానీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఆ వైద్యాధికారి తన పలుకబడిని చూపి వారంరోజులు తిరగకముందే జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వచ్చి వాలిపోయారు.

శాఖలో తిష్ట వేసి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆయన వైద్యశాఖలో అనధికారింగా విధులు నిర్వహించి ప్రైవేటు వైద్యశాలలకు అనుమతులు ఇచ్చేందుకు భారీగా మామూళ్లు వసూలు చేశారనే ఆరోపణలు వైద్యాధికారిపై ఉన్నాయి. అటువంటి వ్యక్తి ఇప్పుడు వైద్యశాఖలోనే తిష్ట వేశారు. పని కోసం వచ్చే ఉద్యోగులతో మాట్లాడి అంతా తాను చూస్తానంటూ సంబంధిత శాఖ ఉన్నతాధికారి వద్దకు తనే స్వయంగా తీసుకొని వెళ్తున్నారు. ఆ వైద్యశాఖ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ ఉద్యోగులకు తెలియని అంశాలు కూడా ఆయన వద్ద ఉన్నాయంటే వైద్యశాఖ పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ప్రభుత్వ శాఖలను ఇప్పటికే ప్రక్షాళన చేసింది. కానీ వైద్యశాఖను మాత్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. గత పది నెలల నుంచి రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో ఇన్‌చార్జీల పాలన జరుగుతుండటంతో ఆ కార్యాలయంలో ఏమి జరుగుతుందో ఏమి తెలియడం లేదు. ఇక్కడ ఏదైనా జరిగితే పైస్థాయిలో తమకు అండదండలు అందించే ఒక అధికారి ఉండటంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకంలో అడ్డగోలుగా వ్యవహరించిన సమయంలో జిల్లా కార్యాలయంలోనే పనిచేసిన ఆ అధికారి ఇప్పుడు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆఫీసులో కీలక స్థానంలో ఉన్నారు. దీంతో తమకు ఏమి కాదన్న ఉద్దేశంతో అలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



ఇప్పటికైనా కలెక్టర్‌తో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని వైద్యశాఖను ప్రక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులు కోరుతున్నారు.

అవీఇవీ

టీడీపీ నేతలను పరామర్శించిన మంత్రి


జేపీపాలెంలో టీడీపీ నేత రాధాకృష్ణమూర్తిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగర్ల మూడివారిపాలెం గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలువురు టీడీపీ నేతలను పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు తెలగతోటి రాధాకృష్ణమూర్తిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ నాయకులు ధూళిపాళ్ల సుబ్బరావును పరామర్శించారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ భర్త, టీడీపీ నేత జాగర్లమూడి వాయునందనరావు నివాసంలో వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట టీడీపీ మండల నాయకులు కె.వి.సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, స్థానిక నేత జాగర్లమూడి శ్రీనివాసరావు, గరిమిడి జగన్, అమృతపూడి ఏసోబు, గురుబాబు. శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు, కబడ్డీ అసోసియేషన్‌కు మంచి పేరు తేవాలి


ఎంపికైన జిల్లా బాలుర జట్టుతో అసోసియేషన్ నేతలు

చినగంజాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోటీలలో బాగా ఆడి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు, కబడ్డీ అసోసియేషన్‌కు మంచి పేరు తేవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వై.పూర్ణ చంద్రరావు, ఉపాధ్యక్షులు ప్రసాద్‌లు అన్నారు. స్థానిక మాగుంట సుబ్బ రామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టును శుక్రవారం వారు ఎంపిక చేశారు. జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టుకు ఈ నెల 15వ తేదీన 16 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి, ఈ నెల 16 తేదీ నుంచి 20వ తేదీ వరకు వారికి శిక్షణ ఇచ్చినట్లు పూర్ణచంద్రరావు తెలిపారు. 16 మంది ప్రాబబుల్స్‌లో ప్రతిభ చూసిన 12 మందిని తుది జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే 50వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ బాలుర, బాలికల టోర్నమెంట్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి రమేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ఆట్ల స్వామిరెడ్డి, ముసలారెడ్డి, పల్లపట్ల పోలారెడ్డి, భోగిరెడ్డి నాగాంజనేయులురెడ్డి, శివారెడ్డి, కోట చక్రధర్‌రెడ్డి, నిద్ర శ్రీనివాసరెడ్డి, వాటంబాటి రాజేష్, పిట్టు బాలకృష్ణారెడ్డి, దేశం సుబ్బారెడ్డి, కోచ్ ఎం.గిరిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర కబడ్డీ జట్టు వివరాలు

ఎస్.మణిరెడ్డి(కెప్టెన్) మూలగానివారిపాలెం, జి.రామకృష్ణ, జి.లక్ష్మణ్, జి.బాలజీ, డి.వి.మాధవ్(మూలగానివారిపాలెం), ఎ.అశోక్, బి.భవానీశేఖర్(మున్నంవారిపాలెం), కే.సాయిరామ్(కొత్తపట్నం),జి.మల్లిఖార్జునరెడ్డి(రాజు బంగారుపాలెం), ఎం.సోమేష్(వాడరేవు), కే.ఆకాష్(గొట్లగట్టు), ఎ.వెంకీ(సంతమాగులూరు), మేనేజర్ పి.బాలకృష్ణారెడ్డి, కోచ్ గిరిబాబులు ఉన్నారు.

పోలీసు ఆసుపత్రికి భూమిపూజ

ఒంగోలు క్రైం, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఆసుపత్రికి ఎస్పీ ఏఆర్ .దామోదర్ భూమిపూజ నిర్వహిచారు. శుక్రవారం కిమ్స్ హస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేయనున్న ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏస్పీ మాట్లాడుతూ పోలీసులకు నిత్యం వైద్యసేవలు అందుబాటులో ఉండే విధంగా ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సిబ్బంది తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, కిమ్స్ హస్పిటల్ డైరెక్టర్ టి.గిరినాయుడు, సీఈవో కె.అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, డాక్టర్ భానుమతి, హౌసింగ్ బోర్డు ఈఈ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ

ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను కనిగిరి డీఎస్పీ మహేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన కనిగిరి డీఎస్పీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీని కలిసి కనిగిరి సబ్ డివిజన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను వివరించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మద్దిపాడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో దొడ్డవరం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మోరబోయిన పాపారావు(30) కరెంటు పనులు చేస్తుంటాడు. తన పొలంలో నీరు పెట్టేందుకు గట్టున ఉన్న మోటార్‌ను రిపేర్ చేస్తుండగా షాక్ తగిలి చెరువులో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చెరువులో దూకిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్

టంగుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ విషయాలపై సోదరితో గొడవపడి చెరువులోకి దూకిన వ్యక్తిని హెడ్ కానిస్టేబుల్ రక్షించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చెల్లెమ్మతోటకు చెందిన మిరియాల సాయికుమార్, ఆయన అక్క వల్లూరమ్మ పోలీసు స్టేషన్ ఎదురుగా ఊరచెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్ వద్దకు గురువారంరాత్రి వచ్చారు. అక్కడ వారిద్దరూ గొడవపడ్డారు.మనస్తాపం చెందిన సాయికుమార్ ఊరచెరువులో దూకాడు. అక్క వల్లూరమ్మ పెద్దగా కేకలు వేయడంతో స్టేషన్‌లో ఉన్న పోలీసులంతా పరుగున అక్కడికి చేరుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రావు చెరువులోకి దూకి మునిగిపోతున్న సాయికుమార్‌ను బయటకు తీసి రక్షించారు. వెంకట్రావును ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్ఐ నాగమల్లీశ్వరరావు అభినందించారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థల వివాదంలో జరిగిన దాడి ఘటనలో నేరం రుజువుకావడంతో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఒంగోలు స్పెషల్ జేఎఫ్‌సీఎం ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి కోమలివల్లి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన మద్రావుల సుబ్బారావుకు చెందిన స్థలంలో ఇల్లు నిర్మించుకొనేందుకు ఆయన కుటుంబ సభ్యులు 2018లో గుంతలు తవ్వుతుండగా అదే గ్రామానికి చెందిన మద్రావుల శ్రీనివాసరావు, అతని భార్య పార్వతి, వారి కుమార్తె నాగలక్ష్మిలు కలిసి సుబ్బారావుపై కర్రతో దాడి చేశారు. ఆయన భార్య అడ్డుకోగా ఆమెను కొట్టి గాయపరచారు. బాధితులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు నాటి ఏఎస్ఐ దేవదానం కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ బాజీ నాగేంద్రప్రసాద్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆ కేసులో సాక్షులను కోర్టులో హాజరు పరచారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుజాత వాదించారు. దాంతో నేరం రుజువు కావడంతో ఏ1 నిందితుడిగా ఉన్న మద్రావుల శ్రీనివాసరావుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.7వేల జరిమానా, ఏ2, ఏ3 నిందితురాళ్లకు రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన నాగులుప్పలపాడు పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

అద్దంలా రోడ్లు - అధ్వానంగా మార్జిన్‌లు

చెన్నుపల్లి - అనంతవరం, వేమవరం - తాతపూడి రహదారులు అస్తవ్యస్తం

ఎదురెదురుగా వాహనాలు వస్తే అంతేసంగతులు

వాహన చోదకులు పడరాని పాట్లు

నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే దారులను పట్టించుకోని అధికారులు



వేమవరం - మురికిపూడి గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు మార్జిన్‌లు

బల్లికురవ. డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే చెన్నుపల్లి-అనంతవరం రోడ్డులో మార్జిన్ కష్టాలను వాహనచోదకులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మాత్రం బాగున్నా మార్జిన్ గోతులతో నిండి ఉంది. దీంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బల్లికురవ మండల పరిధిలోని చెన్నుపల్లి- అనంతవరం అర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న వేమవరం, మురికిపూడి, తాతపూడి గ్రామాల మధ్య తారు రోడ్డు సైడు మార్జిన్ అధ్వానంగా తయారయింది. ఈ రోడ్డునుంచి నిత్యం వందలాది గ్రానైట్ వాహనాలు, ప్రజలు నేషనల్ హైవేకు వెళుతుంటారు. ఈ రోడ్డును గతంలోనే కొంత భాగం డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయగా కొంతభాగం సింగిల్ రోడ్డుకు తారు వేశారు. అయితే మార్జిన్‌లు మాత్రం చేపట్టలేదు. దీంతో వాహనాలు రోడ్డు దిగితే దిగబడి పోతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వాహనాల రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే వేమవరం నుంచి తాతపూడి వరకు ఉన్న రోడ్డు మార్జిన్‌లను అభివృద్ధి పరచాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్‌లు లేకపోవటంతో వేమవరం - తాతపూడి గ్రామాల మధ్య ట్రాఫిక్ ఇక్కట్లు

శరవేగంగా రాతి మండపం నిర్మాణం

మరో రెండు నెలల్లో పూర్తి చేసే దిశగా చర్యలు

అద్దంకి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ రాతి మండపం నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయి. సుమారు 6 కోట్ల రూపాయలతో రాతి ముఖమండపం నిర్మాణం రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమయ్యింది. 2 కోట్ల రూపాయలు తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు, మరో 2 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు కాగా, మిగిలిన 2 కోట్ల రూపాయలు దాతల సహకారంతో పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మందకొడిగా సాగిన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈవోగా తిమ్మానాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత పనులు వేగవంతం అయ్యాయి. ఇప్పటికే అత్యధిక శాతం నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. మార్చి నెలలో శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల వార్షిక తిరునాళ్ల జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెలలోనే రాతి మండపం నిర్మాణం పనులు పూర్తి చేసే దిశగా పనులు వేగవంతం చేశారు. అదే సమయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠకు కూడా పనులు ప్రారంభించారు. అన్ని పనులు పూర్తయిన తరువాత శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రస్తుతం బాలాలయంలో ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన విగ్రహం వద్ద పూజలు జరుగుతుండగా, నిర్మాణ పనులు పూర్తయిన తరువాత పాత ఆలయంలో పూజలు, అభిషేకాలు పునః ప్రారంభించే దిశగా అధికారులు పనులు చేయిస్తున్నారు. రాతి మండపానికి మూడు వైపులా ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు.



శింగరకొండలో అత్యధిక భాగం పూర్తయిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండపం



నిర్మాణం పూర్తయిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ మండపం ద్వారం

నేర నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

- ఎస్పీ తుషార్ డూడీ
- చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



చీరాల వన్‌టౌన్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

చీరాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణలో సిబ్బంది నిర్లక్ష్యంగా కూడదని ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. శుక్రవారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలు, కేసులకు సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. సిబ్బందితో సుదీర్ఘంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల చీరాల పరిధిలో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఒంటరి మహిళల వివరాలు సేకరించి, పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. వారి పరిసరాల్లో సీసీకెమెరా నిఘా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పరిసరాల్లో అనుమానితుల వివరాలు స్టేషన్‌కు అందించి సహకరించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎండీ మోయిన్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

కారంచేడు(పర్చూరు) : నేరాలు నియంత్రించటంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. శుక్రవారం కారంచేడు పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్ పరిశరాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీచేసి స్థానిక ఎస్సైకి తగిన సూచనలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని పొందుపరుస్తూ సక్రమంగా రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో జరిగే నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు, విధులు తదితర అంశాల గురించి, అలాగే ప్రతి ఒక్కరి వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య ఎస్సై వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

ఐక్యవేదిక సభ్యుల నిరసన



అద్దంకిలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వేదిక సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాలను పట్టుకుని నినాదాలు చేస్తు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ఐ క్యవేదిక ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అంకం నాగరాజు, దేవపాలన, చంద్రమౌళి, బాబురావు, కాంతారావు, జోషప్, యోహాన్, రోశయ్య సుదర్శన్, ప్రభాకరరావు, హనుమంతరావు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో..

మార్టూరు : అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని సమతా సైనిక్ దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మార్టూరు నేతాజీ నగర్, నేతాజీ నగర్ బొమ్మల సెంటర్‌లో సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ పోటీలు

చినగంజాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖాజీపాలెం కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 22వ తేదీ ఉదయం 8గంటల నుంచి జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల, మహిళల 10 కిలో మీటర్లు, అండర్-20 విభాగంలో బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 6 కిలోమీటర్లు, అండర్-18 విభాగంలో బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 4 కిలోమీటర్లు, అండర్-16 విభాగంలో బాలురకు 2కిలోమీటర్లు, బాలికలకు 2 కిలోమీటర్లు క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో 1, 2, 3 స్థానాలు సాధించిన వారికి మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అంజేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు లేదా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తప్పనిసరని తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటలకు పోటీలు జరిగే ప్రదేశంలో అథ్లెటిక్స్ రిపోర్టు చేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు7997005087, 8978482329 సెల్ నెంబర్లను సంప్రదించాలని వెంకటరెడ్డి కోరారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



రోటరీ అధ్వర్యంలో అందిస్తున్న కుట్టుమిషన్లు

ఇంకొల్లు,డిసెంబరు 20,(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇంకొల్లు సెంట్రల్ రోటరీక్లబ్ తమ వంతు కృషి చేస్తూ ముందుకు సాగుతోందని ఆక్లబ్ అధ్యక్షులు షేక్ రఫీ అన్నారు.స్థానిక రోటరీ భవనంలో శుక్రవారం 11 మంది పేదమహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, జెట్టి స్వామి, పులఖండం బద్రిరెడ్డి, హన్ను, నిమ్మగడ్డ హనుమంతరావు, మహిళలు పాల్గొన్నారు.

కొత్తపేట శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

కొత్తపేట(చీరాలటౌన్), డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక కొత్తపేట శ్మశానవాటిక అభివృద్ధికి కొత్తపేట ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.లక్ష నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసబాబు, గోవర్ధన్, మాధవరావు, కోటేశ్వరరావ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



ప్రశంసాపత్రం అందుకుంటున్న కొండమంజులూరు పాఠశాల విద్యార్థి పవన్ గోపీకృష్ణ

రాష్ట్రస్థాయి పోటీలకు కొండమంజులూరు విద్యార్థులు

పంగులూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వం పోటీలలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలలో కొండమంజులూరు పాఠశాల 8వ తరగతి విద్యార్థి పవన్ గోపీకృష్ణ వ్యాసరచనలోను, 9వ తరగతి విద్యార్థి కప్పెర జాన్‌బాబు వక్తృత్వపు పోటీలో ప్రథమస్థానంలో నిలిచారు. వీరు ఈనెల 23న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం అనిత తెలిపారు. శుక్రవారం జిల్లా సైన్స్ అధికారి సాదిక్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులను, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, రావుల వెంకటనరసింహారావు, చింతల సహదేవుడు, ప్రధాన దాత బొప్పూడి నాగేశ్వరరావు, హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు అభినందించారు.



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

సమాచార దరఖాస్తులకు సకాలంలో జావాబు ఇవ్వాలి

బల్లికురవ. డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా వివరాల దరఖాస్తులు చేస్తే వారికి నిర్ణీత సమయంలో జావాబు ఇవ్వాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు సకాలంలో చేపట్టాలన్నారు. అలానే గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులకు వెంటనే పరిష్కారం చుపాలన్నారు. అలానే వర్షాలు కురుస్తున్నందున గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇంటింటా చేస్తున్న సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈసమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి తదితరులు పాల్గొన్నారు.



తూర్పు తక్కెళ్లపాడులో భూ సమస్యపై రైతులు ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పంగులూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని మండల తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.గ్రామంలోని ఎస్టీ కాలనీలో పర్యటించి ఆధార్, రేషన్ కార్డులు, నివేశన స్థల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బి.సురేష్, పచ్చా శ్రీనివాసరావు, జగర్లమూడి భాను ప్రకాష్, పిచ్చిరెడ్డి, స్థానిక రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 55 అర్జీలు

చినగంజాం : మండలంలోని నీలాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 55 అర్జీలు అందినట్లు తహసీల్దార్ జె.ప్రభాకరావు తెలిపారు. ఈ సదస్సులో మ్యూటేషన్ కోసం 20, ఎఫ్ లైన్ కొరకు 21, తప్పుల సవరణకు 5, ప్రత్యామ్నాయం కోసం 1, 1బి అడంగల్ కోసం 6, డిజిటల్ సంతకం కోసం2 ఆర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామాక్షికేర్ హాస్పిటల్స్ ఎండీ దేవరాజ్

ప్రేమ, త్యాగంతో వైద్య సేవలు అందించాలి

చీరాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు వలె ప్రేమ, త్యాగంతో వైద్య సేవలు అందించాలని శ్రీకామాక్షికేర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. స్థానిక దండుబాటలోని నర్సింగ్ ఆఫ్ కాలేజ్‌లో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా దేవరాజ్ కేక్ కటచేసి నిర్వహించి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ చవ్వా దుర్గారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపల్ దివ్య, నెహేమియా, కళ్యాణి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు

50 మంది పేద మహిళలకు చీరల పంపిణీ

అద్దంకిటౌన్: క్రీస్తు బోధనలు అందరూ ఆచరించదగినవి అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పనుమర్తిపాలెంలోని డాక్టర్ క్లౌఫ్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో విశ్రాంత తహసీల్దార్ తాతా బాలసుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో 50 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీ సుధాకరరావు, ఏజీ మహమ్మద్ రఫీ, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి రవికుమార్

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి రవికుమార్

అద్దంకి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలతో వైద్యం చేయించుకున్న 111 మందికి 1,26,71,093 రూపాయల చెక్కులు, 6 గురుకి 29.80 లక్షల రూపాయల ఎన్‌వోసీ పత్రాలు శుక్రవారం మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో 201 మందికి 2.26 కోట్ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 39 మందికి 1.42 కోట్ల రూపాయల ఎన్‌వోసీలు అందజేశామన్నారు.

రూ.2.60 కోట్ల సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ భవనాలు

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద సామాజిక బాధ్యతగా అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ శాఖ ద్వారా సుమారు 2.60 కోట్ల రూపాయలతో ఎస్సీ, బీసీ, మైనార్టీ కాలనీలలో 11 కమ్యూనిటీ భవనాలను, ఒక కళాశాల లో భోజనశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కమ్యూనిటీ భవనాలను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, కాకాని అశోక్, చిన్ని శ్రీనివాసరావు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీసీ వైస్‌చైర్మన్ పేరయ్య

బల్లికురవ : బల్లికురవ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికకావటంతో పాటు అద్దంకి డీసీ కమిటీలో వైస్ చైర్మన్‌గా అయిన కోయ పేరయ్య, నక్కబొక్కలపాడు నీటి సంఘం అధ్యక్షుడు దర్శి రామస్వామిలు శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా నీటి సంఘాల అధ్యక్షులు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పేదవిద్యార్థినికి లాప్‌ట్యాప్ అందజేత

ఇంకొల్లు,డిసెంబరు 20,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసపాడుకు చెందిన ఘంటా నాగభూషణం,వంకాయలపాటి శివరామకృష్ణయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల సహకారంతో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు ప్రతిభ కలిగిన పేద విద్యార్థిని కొమరనేని గౌతమికి ల్యాప్‌ట్యాప్ అందించారు. ఈ కార్యక్రమంలో మండవసహదేవరావు, ఘంటా బాబు, కరణం పూర్ణచంద్రరావు, యార్లగడ్డ రామకృష్ణ, కరణం రమేష్, సూది సుబ్బారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డుప్రమాదంలో సైక్లిస్టుకు తీవ్ర గాయాలు



రోడ్డుపై అపస్మారక స్థితిలో ఉన్న యువకుడు

చీరాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ముందు ఉన్న ఆటోను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం, సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ఘటనలో సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. అందిన వివరాల ప్రకారం.. స్థానిక జాన్‌పేటకు చెందిన కొర్రెపాటి ప్రభుకుమార్ అలియాస్ తల్లులు సైకిల్‌పై ఇంటి నుంచి పేరాలకు వస్తున్నాడు. ఈక్రమంలో కారంచేడు రైల్వే గేటు సమీపంకు రాగానే ఎదురుగా ద్విచక్ర వాహనం, ఆటో వస్తున్నాయి. ఆటోను తప్పించుకునే క్రమంలో ద్విచక్రవాహనం, సైకిలుఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన సైకిలిస్టును స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వేడి పాలు మీద పడి విద్యార్థికి గాయాలు

చీరాలటౌన్ : వేడిపాలు మీదపడి విద్యార్థితీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన చినగంజాంలోని హార్ప్ ప్రయివేట్ హాస్టల్లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. హాస్టల్ వార్డెన్ దాసరి మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మేదరమెట్లకు చెందిన పావులూరి వినోద్‌కుమార్ చినగంజాం జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతూ స్థానికంగా ఉన్న ప్రయివేట్ హాస్టల్లో ఉంటున్నాడు. ఈక్రమంలో సాయంత్రం సమయంలో ఆడుకుంటుండగా వేడిపాలు ప్రమాదవశాత్తు మీద పడ్డాయి. దీంతో శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో వార్డెన్ చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అలాగే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

యువతిని వేధిస్తున్న యువకుడు

- ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు

ఈపూరుపాలెం(చీరాలటౌన్): తనకు పెళ్లి సంబంధాలు రాని వ్వకుండా వ్యక్తి వేదిస్తున్నట్లు ఓ యువతి ఈపూరుపాలెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఆమెతో గతంలో ఉన్న పరిచయంతో ఫొటోలు మార్ఫింగ్ చేసి వేదిస్తున్నట్లు బాధితురాలు పోలీసుల వద్ద బోరుమంది. తనను వేధిస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

కారు ఢీ కొని ద్విచక్రవాహనదారునికి గాయాలు



క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

చినగంజాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహదారుని ఢీ కొట్టడంతో గాయాలైన సంఘటన కడవకుదురు సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారుకు టైరు పంక్చర్ అయింది. దీంతో కారు వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా చీరాల నుంచి కడవకుదురుకు ద్విచక్రవాహనంపై వస్తున్న బండారు ధనరాజుని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ధనరాజ్‌కు తీవ్ర రక్త గాయాలయ్యాయి. అతని ఎడమ కాలు నాలుగు వేళ్లు తెగిపోయాయి. క్షతగాత్రుని హైవే అంబులెన్స్‌లో చీరాల ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ శీలం రమేష్ పరిశీలించారు.